VELTHURU TELUGU DAILAY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
శుక్రవారం 24.04.2026

సంపుటి: 07 సంచిక: 319
పేజీలు: 12 వెల: రూ. 5/

Velthuru Newspaper

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH



## ఎమ్మెల్సీల ఆమోదానికి గవర్నర్‌కు జులై వరకు సమయం..!!

2

అటార్నీ జనరల్ విజ్ఞప్తి మేరకు గడువు పెంచిన సుప్రీంకోర్టు

# బెంగాల్‌లో బీజేపీ విజయం ఖాయం

- ఎన్నికల వేళ ప్రధాని మోదీ ధీమా
- కృష్ణానగర్ సభలో టీఎంసీపై ఆగ్రహం
- ఝూల్‌మురి వ్యాఖ్యతో రాజకీయ వ్యంగ్యం
- చొరబాటుదారులకు టీఎంసీ ఆశ్రయం ఇస్తోందని ఆరోపణ
- సబ్‌కా సాత్ వర్సెస్ సిండికేట్ పాలనపై విమర్శలు
- సీఏఏ అమలు వేగవంతం చేస్తామని హామీ
- శరణార్థులు, మతువా, నమశూద్రులకు భరోసా
- శాంతియుత పోలింగ్‌పై ఎన్నికల సంఘానికి ప్రశంసలు

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 23:

బంగాల్‌లో రెండో దశ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. నదియా జిల్లా కృష్ణానగర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో మార్పు కోసం ప్రజలు భారీగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈసారి బంగాల్‌లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రచార ప్రసంగంలో మోదీ వ్యంగ్య వ్యాఖ్యలు కూడా చేశారు. తాను ఇటీవల ఝూల్‌మురి తిన్నానని, అయితే దాని

..మిగతా 2లో



2

# చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకుందాం




- ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు
- తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచన
- ప్రాణాలు తీసుకోవడం సమస్యలకు పరిష్కారం కాదని హితవు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రేపు చర్చలు
- కార్మిక సమస్యలపై ప్రభుత్వం సానుకూల దృక్పథం
- మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు చేసి చర్యలు
- ఎలక్ట్రిక్ బస్సులపై అపోహలు వద్దన్న ప్రభుత్వం
- కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని హామీ
- ఆత్మహత్యయత్నం చేసిన ఉద్యోగికి మెరుగైన చికిత్స
- ఆవేశపూరిత చర్యలకు దూరంగా ఉండాలని మంత్రుల సూచన
- ఆర్టీసీ కార్మికులు మా కుటుంబ సభ్యులేనన్న ప్రభుత్వం



వెలుతురు, హైదరాబాద్ ఏప్రిల్ 23:

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర మంత్రి వర్గం కీలకంగా చర్చించింది. ఆర్టీసీ కార్మికుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ముఖ్యంగా ప్రాణాలపై ప్రమాదకర నిర్ణయాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశంలో ఆర్టీసీ అంశాన్ని ప్రత్యేకంగా చర్చించినట్లు సీఎం తెలిపారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో

..మిగతా 2లో




## డీకే శివకుమార్‌ను కలిసిన హర్కర వేణుగోపాలరావు

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:

రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ , హైదరాబాద్ వద్ద, కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ & పబ్లిక్ రిలేషన్స్), ఏఐసీసీ సభ్యులు హర్కర వేణుగోపాల్ రావు గారు మర్యాదపూర్వకంగా కలిసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనతో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు తెలంగాణ సర్కార్

## ఎస్ఎల్‌పీ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయం

- న్యాయ విభాగంతో చర్చలు పూర్తి తదుపరి చర్యలకు సిద్ధం
- ప్రాజెక్టు అంశాలపై పూర్తి వివరణ సమర్పించనున్న ప్రభుత్వం
- హైకోర్టు సంచలన తీర్పు – ఘోష్ కమిషన్‌పై ప్రశ్నలు
- కేసీఆర్, హరీశ్ రావు తదితరులపై చర్యలకు బ్రేక్
- నిబంధనలు పాటించలేదని కమిషన్‌పై హైకోర్టు వ్యాఖ్యలు
- రాజకీయంగా, పరిపాలనలో చర్చనీయాంశమైన పరిణామం




హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:

కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

..మిగతా 2లో



3

## చర్చలకు ఒత్తిడి ఏం లేదు

### అమెరికా–ఇరాన్ చర్చలపై కొనసాగుతున్న ఉత్కంఠ

- అమెరికా–ఇరాన్ చర్చలపై కొనసాగుతున్న ఉత్కంఠ
- రెండో విడత చర్చలపై స్పష్టత రాక ఆందోళన
- ఒత్తిడి లేదంటూ ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- మంచి ఒప్పందంపైనే దృష్టి సారించిన అమెరికా ప్రభుత్వం
- సీజ్‌ఫైర్‌పై వస్తున్న వార్తలను ఖండించిన ట్రంప్
- హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తతలు
- నౌకలపై దాడుల ఘటనపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు
- దిగ్బంధనమే ఇరాన్‌కు పెద్ద ముప్పని హెచ్చరిక



## రాహుల్ గాంధీతో మహేష్ కుమార్ గౌడ్ భేటీ

- రాష్ట్ర రాజకీయాలు, పార్టీ సంస్థాగత అంశాలపై చర్చ
- జన్‌పథ్‌లో 15 నిమిషాల పాటు జరిగిన సమావేశం
- కుల గణన, బీసీ రిజర్వేషన్లపై కీలక చర్చ
- తెలంగాణలో పార్టీ బలోపేతంపై వివరించిన టీపీసీసీ చీఫ్
- హైదరాబాద్‌లో జాతీయ ఓబీసీ సమావేశానికి ఆహ్వానం

2

## మోదీ సర్కార్‌ది డబుల్ వైఫల్యం

- ప్రమాదంలో ఎరువులు, ఇంధన భద్రత
- మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు
- డీలిమిటేషన్ పేరుతో ప్రజల దృష్టి మళ్లించారు
- పడిపోయిన ముడిచమురు, గ్యాస్ ఉత్పత్తి
- హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న 14 భారత నౌకలు

2



## తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో ప్రశాంతంగా పోలింగ్

- మండుటెండలోనూ ఉత్సాహంగా ఓట్లు వేసిన ప్రజలు
- తమిళనాడులో 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతగా 152 స్థానాలకు ఓటింగ్
- మొదటి గంటల్లోనే గణనీయ శాతం పోలింగ్ నమోదు
- తమిళనాడులో 84.69 బెంగాల్‌లో 91.78% ఓటింగ్
- ప్రముఖుల ఓటింగ్‌తో పోలింగ్ కేంద్రాల్లో సందడి
- రాజకీయ, సినీ ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగం




## ఎన్నికల తర్వాత ఇంధన షాక్? పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరగనున్నాయా!

2

## కాళేశ్వరం విచారణ ఆగదు అవినీతి దొరల శిక్ష తప్పదు!

బిఆర్ఎస్ 'అబద్ధపు సంబరాల'పై స్పందించినా రేఖ బోయలపల్లి



3

## సిద్దిపేటలో బేకర్ హ్యూస్ తయారీ కేంద్రం ప్రారంభం

- ఉద్యోగ అవకాశాలకు కొత్త ఊ తం
- 230 మందికి నైపుణ్య ఉద్యోగావకాశాలు
- హై ప్రెసిషన్ ఉత్పత్తులతో ప్రపంచ మార్కెట్‌కు సేవలు
- "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్‌కు మరింత బలం




3



3

## మహిళా రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వరెందుకు?

- ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది వేడుకల్లో వెంకయ్యనాయుడు
- ఇష్టపడి చేసిన పనిని కష్టపడి చేస్తే నష్టం ఉండదన్న మాజీ ఉపరాష్ట్రపతి
- విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం కూడా అవసరమని సూచన

W

## ఎమ్మెల్సీల ఆమోదానికి గవర్నర్‌కు జులై వరకు సమయం..!!

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:

ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ల ఎమ్మెల్సీ పదవులకు ఆమోదం తెలిపేందుకు గవర్నర్‌కు సమయం కావాలని, కొత్త గవర్నర్ మార్చి నెలలోనే వచ్చారని సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరిన అటార్నీ జనరల్ఇ ది గవర్నర్-గవర్నమెంట్ మధ్య విషయమని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన నామినేషన్లు సరిగ్గా ఉంటే గవర్నర్ ఆమోదం తెలుపుతారని లేకపోతే తిరస్కరిస్తారని అటార్నీ జనరల్ వెల్లడి దీంతో ఇప్పుడు గవర్నర్ గవర్నమెంట్ ఒకే వైపు లేరా? అని ప్రశ్నిస్తూ, ఎమ్మెల్సీ పదవులకు ఆమోదం తెలిపేందుకు జూలై 22వ తేదీ వరకు గవర్నర్‌కు సమయం ఇచ్చిన సుప్రీంకోర్టు మరోవైపు ఏప్రిల్ 30వ తేదీ లోపు ఏదైనా పదవి రాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి తొలగిపోనున్న క్రమంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందని రాజకీయ విశ్లేషకుల మధ్య మొదలైన చర్చలు..!!!

## కాళేశ్వరం తీర్పుపై సుప్రీంకోర్టుకు తెలంగాణ సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

## సిద్దిపేటలో బేకర్ హ్యూస్ తయారీ కేంద్రం ప్రారంభం

సిద్దిపేట జిల్లా వెలుతురు ఏప్రిల్ 23:

సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారంలోని టీజీఐఐసీ పారిశ్రామిక పార్కులో ఉన్న ఆజాద్ - సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన "బేకర్ హ్యూస్ కోసం ప్రత్యేక లీన్ తయారీ కేంద్రాన్ని" రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ సంస్థ బేకర్ హ్యూస్ ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో ఆయిల్ ఫీల్డ్ సేవలు, పరిశ్రమల మరియు ఇంధన సాంకేతికత, డిజిటల్ పరిష్కారాల రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తాజాగా ప్రారంభమైన ఈ కేంద్రంలో సంస్థకు చెందిన పరిశ్రమల మరియు ఇంధన సాంకేతిక విభాగానికి అవసరమైన అత్యంత సున్నితమైన, అధిక నాణ్యత గల ఉత్పత్తులు తయారవుతాయి. ఈ కొత్త యూనిట్ ద్వారా సుమారు 230 మంది నైపుణ్య వర్క్ ఫోర్స్‌కు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఆధునిక సాంకేతికతతో తయారయ్యే ఈ ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ కలిగి ఉండటంతో, "మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ మరింతగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతుందని అధికారులు పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీతో మహేష్ కుమార్ గౌడ్ భేటీ

ఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 23:

ఢిల్లీలోని జన్‌పథ్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గురువారం సమావేశమయ్యారు. సుమారు 15 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు తాజా రాజకీయ పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ పరంగా జరుగుతున్న సంస్థాగత కార్యక్రమాలను మహేష్ కుమార్ గౌడ్ రాహుల్ గాంధీకి వివరించారు. జిల్లా, మండల కమిటీలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకాలు, అనుబంధ సంఘాల నిర్మాణం వంటి అంశాలను వివరంగా సమర్పించారు. రాష్ట్రంలో నిర్వహించిన కుల గణన వివరాలను కూడా ఆయన రాహుల్ గాంధీకి వివరించినట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కూడా చేర్చాలని మహేష్ కుమార్ గౌడ్ రాహుల్ గాంధీని కోరారు. అలాగే రాబోయే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ జాతీయ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ సమావేశానికి ముందు మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్ కూడా రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు.

## మోదీ సర్కార్‌ది డబుల్ వైఫల్యం

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 23:



కేంద్ర ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. దేశ ప్రజలకు ఇంధన భద్రత, ఎరువుల భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని ముందుకు తెచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. దేశంలో ఇంధన ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయిందని, దిగుమతుల వైవిధ్యీకరణ పూర్తిగా విఫలమైందని ఖర్గే ఆరోపించారు. 2014-15 నుంచి దేశ ముడిచమురు ఉత్పత్తి దాదాపు 22 శాతం పడిపోయిందని, గ్యాస్ ఉత్పత్తి సుమారు 40 శాతం తగ్గిందని గణాంకాలను ప్రస్తావించారు. 2011-12లో గ్యాస్ ఉత్పత్తి 47,555 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లుగా ఉండగా, 2020-21 నాటికి అది 28,672 ఎంఎంఎస్‌సీఎంకు తగ్గిందని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో భారత జెండా ఉన్న 14 నౌకలు చిక్కుకుపోయాయని, అవి 54 రోజులుగా అక్కడే నిలిచిపోయాయని ఖర్గే వెల్లడించారు. దేశం ఇంధన దిగుమతులపై అధికంగా ఆధారపడటం వల్ల ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. ఎరువుల అంశంపైనా ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలో పలు సీజన్లలో ఎరువుల కొరత కొనసాగుతోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రపంచ స్థాయిలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగకముందే దేశంలో ఎరువుల సరఫరా సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ఎరువుల ఉత్పత్తి ఐదేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయిందని పేర్కొన్నారు. చైనా ఇప్పటికే ప్రత్యేక ఎరువుల ఎగుమతులపై ఆంక్షలు విధించిందని, రష్యా కూడా ఎగుమతులను నిలిపివేసిందని ఖర్గే ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా దిగుమతుల మార్గాలను విభిన్నీకరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి, ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని ఖర్గేను ఆదేశించింది. దీనిపై ఆయన స్పందిస్తూ నోటీసు వచ్చిన తర్వాత గురువారం సాయంత్రం సమాధానం ఇస్తామని తెలిపారు. ఈ అంశం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. ఖర్గే వ్యాఖ్యలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తీవ్రంగా స్పందించారు. వరుస ఎన్నికల ఓటముల కారణంగా కాంగ్రెస్‌లో ఏర్పడిన నిరాశే ఇలాంటి వ్యాఖ్యలకు కారణమని ఆయన విమర్శించారు. ప్రధానికి ఖర్గే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించడంలో కాంగ్రెస్ అతి చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

# చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తోందని, వారితో చర్చలు జరిపి పరిష్కారం కనుగొంటామని హామీ ఇచ్చారు. ప్రాణాలు తీసుకోవడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, కుటుంబాల భవిష్యత్తు దృష్ట్యా ఆవేశపూరిత చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రుల బృందం రేపు ఆర్టీసీ కార్మిక సంఘాలతో సమావేశం కానుంది. కార్మికుల డిమాండ్లను నేరుగా వినిపించుకొని, వాటిపై చర్చలు జరిపి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఆర్టీసీ సమస్యల పరిష్కారం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కొంత ఆలస్యమైనా కేబినెట్ స్థాయిలో చర్చ జరిపామని, సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు మంత్రుల ఆధ్వర్యంలో సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేపు జేఏసీ నాయకులతో చర్చలు జరిపి, పరిష్కార మార్గాలపై ముందడుగు వేస్తామని చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశంతో ఉద్యోగాలు కోల్పోతారనే ప్రచారం సరైంది కాదని మంత్రి ఖండించారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని, వారి భద్రత, భవిష్యత్తు కోసం కట్టుబడి ఉందని వెల్లడించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజా పాలన అని, ఆర్టీసీ కార్మికుల ప్రభుత్వం కూడా ఇదేనని పేర్కొన్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రాణాలకు హాని చేసే చర్యలకు పాల్పడవద్దని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్మికులు తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించిన ఆయన, నేడు జరగనున్న చర్చల్లో సానుకూల పరిణామాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేబినెట్ ఎజెండా ప్రారంభం కాకముందే ఆర్టీసీ అంశాన్ని చర్చించామని వివరించారు. మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ, ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆర్టీసీ ఉద్యోగిని హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. హైదర్‌గూడలోని అపోలో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులు తమ కుటుంబ సభ్యుల్లాంటి వారేనని మంత్రి పేర్కొన్నారు. భావోద్వేగాలకు లోనై తీసుకునే నిర్ణయాలు సమస్యలను మరింత క్లిష్టం చేస్తాయని, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులు ఆత్మబలిదానాలకు పాల్పడవద్దని సూచించారు. ఉద్యమ కాలంలో మనం కలిసి పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత గత ప్రభుత్వ కాలంలో 58 రోజుల సమ్మె జరిగినప్పటికీ, అప్పటి ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీకి రూ.10,000 కోట్లను చెల్లించిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా ఆర్టీసీని బలోపేతం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆత్మహత్యాయత్నం చేసిన ఆర్టీసీ ఉద్యోగి శంకర్ గౌడ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మొత్తం మీద, ఆర్టీసీ సమ్మె సమస్యను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. నేడు జరగనున్న చర్చలు కీలకంగా మారనున్నాయి. కార్మికులు ఆవేశపూరిత నిర్ణయాలకు దూరంగా ఉండి, చర్చలకు సహకరిస్తే సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

# బెంగాల్‌లో బీజేపీ విజయం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

ఘాటు తృణమూల్ కాంగ్రెస్‌కే తగిలిందని అన్నారు. ఈ వ్యాఖ్య సభలో చర్చకు దారి తీసింది. టీఎంసీ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, మార్పు అవసరమని ప్రజలు భావిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. బంగాల్‌లో శాంతి, అభివృద్ధి, పారదర్శక పాలన కోసం ప్రజలు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. టీఎంసీ ప్రభుత్వం చొరబాటుదారులకు ఆశ్రయం ఇస్తోందని, దీనివల్ల రాష్ట్రంలో అస్థిరత పెరుగుతోందని మోదీ ఆరోపించారు. దీన్ని "జంగిల్ రాజ్"గా అభివర్ణిస్తూ, అవినీతి మరియు అణచివేత పాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజల ప్రయోజనాలకు బదులుగా సిండికేట్ వ్యవస్థ ద్వారా రాష్ట్ర వనరులు దోపిడీకి గురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" విధానాన్ని ప్రజలకు గుర్తుచేశారు. కానీ టీఎంసీ పాలనలో "చొరబాటుదారుల అభివృద్ధి" అనే విధానం కొనసాగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మే 4 తర్వాత బంగాల్‌లో సుపరిపాలన ప్రారంభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అనేక జిల్లాల్లో టీఎంసీ ఖాతా కూడా తెరవలేదని జోస్యం చెప్పారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పౌరసత్వ సవరణ చట్టం అమలు ప్రక్రియను వేగవంతం చేస్తామని ప్రకటించారు. శరణార్థులు, మతువా, నమశూద్ర వర్గాలకు పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. భారతదేశానికి ఆశ్రయం కోరుతూ వచ్చిన ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రతి పౌరుడికి లభించే హక్కులు, ప్రయోజనాలు వీరికీ అందుతాయని స్పష్టం చేశారు. మోదీ "ఒక జిల్లా ఒక ఉత్పత్తి" కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ స్థానిక ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్‌కు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. కానీ టీఎంసీ పాలనలో ప్రతి జిల్లాలో సిండికేట్ వ్యవస్థే పెరిగిందని విమర్శించారు. ఈ సిండికేట్ వ్యవస్థ వ్యాపారాలను అడ్డుకుంటూ రాష్ట్ర అభివృద్ధిని వెనక్కి నెడుతోందని ఆరోపించారు. మొదటి దశ పోలింగ్‌లో భారీ ఓటింగ్ నమోదైనందుకు బంగాల్ ప్రజలకు ప్రధాని అభినందనలు తెలిపారు. ఇది మార్పు కోసం ప్రజల బలమైన సంకల్పానికి సంకేతమని చెప్పారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించిన ఎన్నికల సంఘాన్ని ఆయన ప్రశంసించారు. గతంలో హింసాత్మక వాతావరణం ఉన్న ఎన్నికల పరిస్థితులు ఇప్పుడు మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు భారీ సంఖ్యలో ఓటు వేయడం వల్ల బీజేపీకి అనుకూల ఫలితాలు వస్తాయని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఎన్నికల సంఘం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. బంగాల్ ప్రజలు ఈసారి కొత్త చరిత్ర రాయబోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## ఎన్నికల తర్వాత ఇంధన షాక్? పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరగనున్నాయా!

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి వినియోగదారులకు భారంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం స్థిరంగా ఉన్న ఇంధన ధరలు, ఐదు రాష్ట్రాల్లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ పరిస్థితులు ఈ పెరుగుదలకు ప్రధాన కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ వాతావరణం మరింత తీవ్రతరమైతే ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా హర్మూజ్ కెనాల్ (Strait of Hormuz) మూసివేత వంటి పరిణామాలు చోటుచేసుకుంటే, గ్లోబల్ ఆయిల్ సరఫరాలో భారీ అంతరాయం ఏర్పడుతుంది. ఇది నేరుగా క్రూడ్ ఆయిల్ ధరలపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ కోటాక్ ఈక్విటీస్ నివేదిక ప్రకారం, ఇండియాలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.25 నుండి రూ.28 వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ధరలు పెరుగుతున్న ధోరణి కూడా ఈ అంచనాలకు బలం చేకూరుస్తోంది. ఇక దేశీయంగా రూపాయి విలువ తగ్గడం, రవాణా ఖర్చులు పెరగడం, ప్రభుత్వపు పన్ను విధానాలు వంటి అంశాలు కూడా ఇంధన ధరల పెరుగుదలకు దోహదపడతాయి. ఎన్నికల సమయంలో సాధారణంగా ధరలను నియంత్రించే ప్రయత్నాలు ఉంటాయి. అయితే ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ నియంత్రణలు సడలించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో ఇంధన ధరలు పెరిగితే, దాని ప్రభావం సాధారణ ప్రజల జీవన వ్యయంపై పడే అవకాశం ఉంది. రవాణా, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో ప్రశాంతంగా పోలింగ్

న్యూఢిల్లీ వెలుతురు ఏప్రిల్ 23:

తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉత్సాహంగా కొనసాగుతోంది. పశ్చిమబెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 152 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఓటింగ్ జరుగుతుండగా, తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకేసారి పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. తమిళనాడులో 84.69 బెంగాల్‌లో 91.78% ఓటింగ్ఎ న్నికల కమిషన్ ఏర్పాటు చేసిన ఏర్పాట్లతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా పశ్చిమబెంగాల్‌లో గత అనుభవాల దృష్ట్యా కేంద్ర బలగాలను విస్తృతంగా మోహరించారు. మొదటి గంటల్లోనే గణనీయమైన పోలింగ్ నమోదైంది. ఇది ఓటర్ల ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోందని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో కూడా ఓటర్లు క్యూల్లో నిలబడి ఓటు వేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఇక గుజరాత్‌లోని ఉమ్రెత్, మహారాష్ట్రలోని బారామతి, రాహురీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు కూడా ఇదే రోజున జరుగుతున్నాయి. అక్కడ కూడా పోలింగ్ శాంతియుతంగా కొనసాగుతోంది. ఈ ఉపఎన్నికలు స్థానిక రాజకీయ సమీకరణాలకు కీలకంగా మారాయి. తమిళనాడులో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం శివగంగలో ఓటు వేశారు. అలాగే భాజపా నేత ఖుష్బూ సుందర్, ప్రముఖ నటి త్రిష తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీవీకే పార్టీ అధినేత, ప్రముఖ నటుడు విజయ్ చెన్నైలో ఓటు వేశారు. ఆయన తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఈ ఓటింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన కుటుంబంతో కలిసి చెన్నైలో ఓటు వేశారు. ఆయనతో పాటు భార్య దుర్గా స్టాలిన్, కుమారుడు ఉదయనిధి స్టాలిన్ కూడా ఓటు హక్కును వినియోగించారు. పాలక పార్టీ నాయకత్వం ఓటింగ్‌లో పాల్గొనడం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు కూడా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ప్రముఖ నటుడు విక్రమ్, ఆయన కుమారుడు ధ్రువ్ విక్రమ్ చెన్నైలో ఓటు వేశారు. అలాగే ఎంఎన్ఎం చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శ్రుతి హాసన్ కూడా తమ ఓటు హక్కును వినియోగించారు. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. దక్షిణ చెన్నైలోని తిరువన్మియూర్ ప్రాంతంలో నటుడు అజిత్ కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన ఓటు వేసిన తర్వాత "మాకు మార్పు అవసరం లేదు" అన్నట్టుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే ఈ వ్యాఖ్యలపై వివాదం చెలరేగడంతో, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందిస్తూ "ఆయన చెప్పింది సరైనదే" అని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. తరువాత అజిత్ మేనేజర్ స్పందిస్తూ, అలాంటి వ్యాఖ్యలు అజిత్ చేయలేదని స్పష్టంచేశారు. దీంతో ఈ వివాదానికి తెరపడింది. పశ్చిమబెంగాల్‌లో కూడా ఓటింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. తొలి విడతలో కీలక నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతుండటంతో రాజకీయ పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగిస్తున్నారు. మొత్తంగా చూస్తే తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల పోలింగ్ ఉత్సాహంగా కొనసాగుతోంది. ప్రజలు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడానికి ముందుకు రావడం సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. మిగిలిన గంటల్లో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు రానున్న రోజుల్లో వెలువడనున్నాయి.

# అనకాపల్లికి అదృష్టం వరించింది

- **భారీ పెట్టుబడులతో అభివృద్ధి దిశగా దూసుకెళ్తున్న జిల్లా**
- **తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలా అభివృద్ధి ఖాయం**
- **రాంబిల్లిలో రూ.5,400 కోట్ల క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన**
- **సోలార్ ఇన్‌ఘాట్ వేఫర్ ఉత్పత్తితో విదేశాలపై ఆధారాన్ని తగ్గించే ప్రయత్నం**
- **ప్రాజెక్ట్ ద్వారా 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు**

అనకాపల్లి వెలుతురు ఏప్రిల్ 23:

అనకాపల్లి జిల్లాకు అభివృద్ధి పరంగా కొత్త దశ ప్రారంభమైందని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు తెలిపారు. భారీ స్థాయి పెట్టుబడులు, పరిశ్రమలు జిల్లాలోకి రావడంతో భవిష్యత్తులో అనకాపల్లి దేశంలోనే అగ్రగామి జిల్లాగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాంబిల్లి మండలంలో రూ.5,400 కోట్ల వ్యయంతో నిర్మించనున్న క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. రాంబిల్లిలో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి కీలకంగా మారనుంది. ముఖ్యంగా సోలార్ ఇన్‌ఘాట్ వేఫర్ తయారీ ద్వారా దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, విదేశాలపై ఆధారపడే పరిస్థితిని తగ్గించవచ్చని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుందని తెలిపారు. ఇది దేశీయ తయారీకి బలం చేకూర్చే కీలక అడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఇటీవలే రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ArcelorMittal స్టీల్ ప్లాంట్‌కు కూడా శంకుస్థాపన జరిగిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఈ స్థాయిలో పెట్టుబడులు రావడం అనకాపల్లి భవిష్యత్తును పూర్తిగా మార్చేస్తుందని ఆయన అన్నారు. ఇప్పటికే విశాఖపట్నం పరిశ్రమల కేంద్రంగా ఎదిగిన నేపథ్యంలో, ఇకపై వచ్చే పెట్టుబడుల దృష్టి అనకాపల్లిపైనే ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా ఉండి, ప్రస్తుతం దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన జిల్లాల్లో ఒకటిగా మారిందని సీఎం పేర్కొన్నారు. అదే విధంగా అనకాపల్లిని కూడా అభివృద్ధి పథంలో నడిపించి ఆర్థికంగా బలమైన జిల్లాగా తీర్చిదిద్దడం తన లక్ష్యమని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం భారీ లక్ష్యాలతో ముందుకెళ్తోందని సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంతో కేంద్రం పనిచేస్తుండగా, ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఇందులో ఇప్పటికే 90 గిగావాట్ల ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ ద్వారా రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ముఖ్యంగా NTPC సంస్థ రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టబోతోందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం వేగంగా కొనసాగుతోందని సీఎం చెప్పారు. గత 22 నెలల్లో 117 ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చి, రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 4.76 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. విద్యుత్ రంగంపై కూడా సీఎం విమర్శలు చేశారు. 2019 నుంచి 2024 మధ్య విద్యుత్ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదని, విద్యుత్ సంస్థలపై రూ.1.12 లక్షల కోట్ల భారం మోపబడిందని అన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు ద్వారా ప్రజలపై భారీ భారం పడిందని విమర్శించారు. ఉచిత సోలార్ విద్యుత్ వినియోగం జరగకపోవడంతో అదనంగా వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యాయని తెలిపారు. పర్యావరణ హిత రవాణా దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సీఎం చెప్పారు. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అదనంగా మరో 444 బస్సులు కూడా రానున్నాయని చెప్పారు. ఇప్పటికే వెయ్యికిపైగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు, రాబోయే మూడేళ్లలో 5,000కు పైగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్‌గా మారుతాయని తెలిపారు.

# కాళేశ్వరం విచారణ ఆగదు అవినీతి దొరల శిక్ష తప్పదు!

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణపై నిన్నటి హైకోర్టు తీర్పును వక్రీకరిస్తూ బిఆర్ఎస్ నేతలు చేస్తున్న హడావిడిపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడుతోంది. ఇది బిఆర్ఎస్ కు వచ్చిన 'క్లీన్ చిట్' కాదని, కేవలం విచారణ ప్రక్రియలో ఎదురైన ఒక చిన్న 'సాంకేతిక జాప్యం' మాత్రమేనని కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ రేఖ బోయలపల్లి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ కు సవాళ్లు విసిరారు

**1. కుంగిన పిల్లర్లు అబద్ధమా? మీరు మింగిన లక్ష కోట్లు అబద్ధమా?**

"మేడిగడ్డ సాక్షిగా లక్ష కోట్ల ప్రజాధనం గోదావరి పాలైంది అబద్ధమా? పిల్లర్లు కుంగిపోయి ప్రాజెక్టు కుప్పకూలుతుంటే, ఏ కోర్టు తీర్పు మీకు క్లీన్ చిట్ ఇచ్చిందని సంబరాలు చేసుకుంటున్నారు? కోర్టు నివేదిక ఇవ్వొద్దని చెప్పింది కేవలం సాంకేతిక కారణాలతోనే తప్ప, మీ అవినీతిని కడిగేయలేదు."

**2. విచారణ అధికారం మాదే - వెనక్కి తగ్గేది లేదు:**

"హైకోర్టు తీర్పులో స్పష్టంగా ఉంది.. విచారణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని! పీసీ ఘోష్ కమిషన్ పద్ధతిపై కోర్టు అభ్యంతరం చెబితే, మేము మరింత పకడ్బందీగా, అవసరమైతే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐ (CBI) తో విచారణ జరిపిస్తాం. తెలంగాణ ప్రజల సొమ్మును కక్కించే వరకు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం నిద్రపోదు."

**3. ఢిల్లీ డ్రామాలు - లోపాయికారీ ఒప్పందాలు:**

"బిఆర్ఎస్ నేతలు ఢిల్లీ వెళ్లి స్వీట్లు పంచుకోవడం చూస్తుంటే, బిజెపితో కలిసి ఏ రకమైన కుట్రలు చేస్తున్నారో ప్రజలకు అర్థమవుతోంది. దర్యాప్తు సంస్థల నుంచి తప్పించుకోవడానికి మీరు ఎన్ని కాళ్లు పట్టుకున్నా, తెలంగాణ ప్రజల తీర్పు ముందు మీరు దోషులుగా నిలబడక తప్పదు."

**4. దొరలారా.. శిక్ష తప్పదు!**

"విచారణ ఆగిందని మురిసిపోకండి.. ఇది కేవలం ఇంటర్వెల్ మాత్రమే. క్లైమాక్స్ లో మీ అవినీతి తిమింగలాలన్నీ కటకటాల వెనక్కి వెళ్లడం ఖాయం. కాళేశ్వరం పేరుతో మీరు చేసిన పాపం.. తెలంగాణ ప్రజల శాపం మిమ్మల్ని వదలదు."తెలంగాణ బిడ్డల చెమట చుక్కలతో కట్టిన ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకున్న కెసిఆర్ కుటుంబం, ప్రజలకు సమాధానం చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని డాక్టర్ రేఖ హెచ్చరించారు

# "విశ్వగురు కథనం మసకబారుతోంది, ప్రపంచంలో భారత్ 6వ స్థానానికి పడిపోయింది"

- **డా. రేఖ బోయలపల్లి వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:



భారత్ యొక్క గ్లోబల్ ఆర్థిక స్థితి క్షీణిస్తున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో భారత్‌ను 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం భారత్ ప్రపంచంలో 6వ స్థానానికి పడిపోయి, యూకే మరియు జపాన్ వంటి దేశాల కంటే వెనుకబడి ఉందని ఆమె పేర్కొన్నారు.

భారత్‌ను "వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ"గా చూపించే ప్రభుత్వ ప్రచారం వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించడం లేదని ఆమె అన్నారు. "హెడ్లైన్ గ్రోత్ సంఖ్యలు లోతైన నిర్మాణాత్మక సమస్యలను దాచలేవు" అని స్పష్టం చేస్తూ, బలహీనమవుతున్న కరెన్సీ, నిలిచిపోయిన ప్రైవేట్ పెట్టుబడులు, తగ్గుతున్న గ్లోబల్ పోటీ సామర్థ్యం వంటి అంశాలను ప్రస్తావించారు. అంతేకాకుండా, G20 మరియు BRICS వంటి అంతర్జాతీయ వేదికల్లో భారత్ నాయకత్వం ఉన్నప్పటికీ, అది గ్లోబల్ శాంతి లేదా ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం చూపడంలో విఫలమైందని ఆమె విమర్శించారు. "ప్రతీకాత్మక నాయకత్వం మాత్రమే ఉంటే, అది విధాన లోపాలను బయటపెడుతుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రభుత్వం 6.5% జీడీపీ వృద్ధి రేటును ప్రదర్శిస్తున్నప్పటికీ, దాని వాస్తవ ప్రభావంపై డా. రేఖ ప్రశ్నించారు: "దేశం గ్లోబల్ స్థానం పడిపోతున్నప్పుడు, వృద్ధి సంఖ్యలకు అర్థం ఉండదు. ఆప్టిక్స్ కంటే అవుట్‌కమ్స్ ముఖ్యమైనవి."

పరిస్థితిని సరిచేయడానికి, ప్రభుత్వం పారదర్శక ఆర్థిక విధానాలు, బలమైన సంస్థాగత సంస్కరణలు, స్థిరమైన మరియు సమగ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలి అని ఆమె సూచించారు. కేవలం హెడ్లైన్ల ఆధారంగా పాలన కొనసాగించడం సరైంది కాదని ఆమె హెచ్చరించారు.

# మహిళా రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వరెందుకు?

విశాఖపట్నం వెలుతురు ఏప్రిల్ 23:

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గల ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం వందేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ వేడుకలు విద్యా, సాంస్కృతిక రంగాల ప్రముఖులతో కళకళలాడాయి. ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గదర్శకమైన సందేశాలు అందించారు. అలాగే భారత సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విశ్వవిద్యాలయ అభివృద్ధిపై అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడిన వెంకయ్యనాయుడు విద్యార్థుల భవిష్యత్తు, వ్యక్తిత్వ వికాసం, సమాజ నిర్మాణం వంటి అంశాలపై విస్తృతంగా ప్రసంగించారు. "ఇష్టపడి చేసే పనిని కష్టపడి చేస్తే నష్టం ఉండదు. మనసు పెట్టి పనిచేస్తే విజయం సాధ్యమే" అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.

విద్య అనేది కేవలం ఉద్యోగ సాధన కోసం మాత్రమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి మూలమని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. చదువుతోపాటు సంస్కారం కూడా సమానంగా అవసరమని, సంస్కారం లేని విద్య అసంపూర్ణమని అన్నారు. మంచి విలువలు, నైతికతలు, బాధ్యతాయుత భావన విద్యార్థుల్లో పెంపొందాల్సిన అవసరం ఉందని సూచించారు .కుటుంబ విలువల ప్రాధాన్యతను కూడా ఆయన గుర్తుచేశారు. కన్నతల్లి, గురువును ఎప్పటికీ మరవకూడదని విద్యార్థులకు హితవు పలికారు. మన విజయానికి పునాది వేసేది కుటుంబం, గురువులేనని, వారిని గౌరవించడం మన బాధ్యత అని చెప్పారు. ఈ విలువలు జీవితాంతం మనల్ని ముందుకు నడిపిస్తాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితులపై కూడా వెంకయ్యనాయుడు తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రపంచంలో కొన్ని దేశాల సామ్రాజ్యవాద ధోరణుల కారణంగానే యుద్ధాలు జరుగుతున్నాయని విమర్శించారు. భారతదేశం ఎప్పుడూ శాంతిని కోరుకునే దేశమని, ఇతర దేశాలపై ఆధిపత్యం సాధించాలనే భావన మనకు లేదని తెలిపారు. దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ నేరాల స్వరూపం మారుతోందని, ముఖ్యంగా యువత ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే కోర్టుల్లో లక్షలాది కేసులు పెండింగ్‌లో ఉండటం న్యాయ వ్యవస్థకు సవాలుగా మారిందన్నారు. మహిళల సాధికారతపై మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేయడం సరైంది కాదని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ బిల్లు ఇవాళ కాకపోతే రేపైనా అమల్లోకి వస్తుందని, సమాజ అభివృద్ధికి మహిళల పాత్ర కీలకమని అన్నారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. డిజిటల్ యుగంలో పోటీతత్వం పెరిగిందని, అందుకు తగ్గట్లుగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కొత్త టెక్నాలజీలపై అవగాహన పెంచుకుని, ప్రపంచ స్థాయిలో నిలబడేలా సిద్ధం కావాలని చెప్పారు. ఈ శతాబ్ది వేడుకలు ఆంధ్రా యూనివర్సిటీ గొప్ప చరిత్రను ప్రతిబింబిస్తున్నాయని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. దేశానికి అనేక మంది గొప్ప వ్యక్తులను అందించిన ఈ విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి విద్యా ప్రమాణాలను మరింత పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ కురియన్ జోసెఫ్ కూడా విశ్వవిద్యాలయం సేవలను కొనియాడారు. విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని, యువత తమ బాధ్యతను గుర్తించి ముందుకు సాగాలని అన్నారు. న్యాయం, సమానత్వం వంటి విలువలు సమాజ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. మొత్తంగా ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది వేడుకలు ఘనంగా కొనసాగుతుండగా, ప్రముఖుల సందేశాలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తున్నాయి. విద్య, సంస్కారం, సాంకేతికత, సామాజిక బాధ్యత వంటి అంశాలపై వచ్చిన సూచనలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చర్చలకు ఒత్తిడి ఏం లేదు

- **రెండో విడత చర్చలపై స్పష్టత రాక ఆందోళన**
- **ఒత్తిడి లేదంటూ ట్రంప్ కీలక వ్యాఖ్యలు**
- **మంచి ఒప్పందంపైనే దృష్టి సారించిన అమెరికా ప్రభుత్వం**
- **సీజ్‌ఫైర్‌పై వస్తున్న వార్తలను ఖండించిన ట్రంప్**
- **హర్మూజ్ జలసంధిలో మళ్లీ ఉద్రిక్తతలు**
- **నౌకలపై దాడుల ఘటనపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు**
- **దిగ్బంధనమే ఇరాన్‌కు పెద్ద ముప్పని హెచ్చరిక**
- **అమెరికాపై ఇరాన్ అధ్యక్షుడు పెజష్కియాన్ తీవ్ర విమర్శలు**
- **చర్చలకు అడ్డంకులుగా బెదిరింపులు, ఆంక్షలని ఇరాన్ వ్యాఖ్యలు**



అమెరికా వెలుతురు ఏప్రిల్ 23:

అమెరికా-ఇరాన్ మధ్య జరగాల్సిన రెండో విడత చర్చలపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. మొదటి విడత చర్చల అనంతరం పరిస్థితులు కొంతమేర సద్దుమణిగినట్టే కనిపించినప్పటికీ, తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలు మరోసారి ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్‌తో చర్చలను పునఃప్రారంభించేందుకు తనపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. చర్చలు కొనసాగాలంటే అవి అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలని, తాము తొందరపడే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు. మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఈ అంశాన్ని రాజకీయంగా మలుస్తున్నారనే ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. కాల్పుల విరమణ (సీజ్‌ఫైర్) స్వల్పకాలికమే అన్న ప్రచారాన్ని ట్రంప్ తోసిపుచ్చారు. అమెరికా ప్రభుత్వం దీర్ఘకాలిక స్థిరత్వం కోసం కట్టుబడి ఉందని చెప్పారు. తాము తీసుకునే నిర్ణయాలు దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఉంటాయని, ప్రజల కోసం ఉత్తమమైన ఒప్పందం కుదుర్చుకోవడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఇరాన్‌కు ఎలాంటి గడువు విధించలేదని ట్రంప్ తెలిపారు. శాంతి ప్రతిపాదనలు ఎప్పుడైనా స్వాగతించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అయితే ఆ ప్రతిపాదనలు స్పష్టంగా, పారదర్శకంగా ఉండాలని, పరస్పర నమ్మకం పెంపొందించే విధంగా ఉండాలని సూచించారు.

ఇక హర్మూజ్ జలసంధి పరిస్థితిపై కూడా ట్రంప్ స్పందించారు. ఇటీవల అక్కడ మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగిన సంగతి తెలిసిందే. బుధవారం ఇరాన్ పలు నౌకలపై కాల్పులు జరిపి, కొన్నింటిని స్వాధీనం చేసుకోవడం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ ఘటనపై స్పందించిన ట్రంప్, ఆ నౌకలు అమెరికాకు చెందినవికావని స్పష్టం చేశారు. అయినప్పటికీ ఆ ప్రాంతంలో పరిస్థితిని తమ ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. హర్మూజ్ జలసంధి అంతర్జాతీయ వాణిజ్యానికి కీలక మార్గం కావడంతో అక్కడి పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చమురు రవాణా పెద్ద ఎత్తున ఈ మార్గం ద్వారానే జరుగుతుండటంతో, ఏ చిన్న ఉద్రిక్తత కూడా ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇరాన్‌పై ఆంక్షల విషయానికొస్తే, ట్రంప్ మరోసారి కఠిన హెచ్చరికలు చేశారు. బాంబు దాడుల కంటే ఆర్థిక దిగ్బంధనమే ఇరాన్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. దిగ్బంధన చర్యల వల్ల ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతింటాయని, పరిస్థితులు మరింత విషమిస్తే చమురు బావులు శాశ్వతంగా మూతపడే ప్రమాదం కూడా ఉందని హెచ్చరించారు.

ఈ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా తీవ్రంగా స్పందించింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజష్కియాన్ అమెరికా వైఖరిపై ఘాటు విమర్శలు చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, చర్చలు, ఒప్పందాలను తమ దేశం ఎప్పుడూ స్వాగతిస్తుందని తెలిపారు. అయితే మాట తప్పడం, బెదిరింపులు, ఆంక్షలు వంటి చర్యలు చర్చలకు అడ్డంకులుగా మారుతున్నాయని అన్నారు.

అమెరికా మాటలు, చర్యల మధ్య తేడాను ప్రపంచం గమనిస్తోందని పెజష్కియాన్ వ్యాఖ్యానించారు. నమ్మకాన్ని దెబ్బతీసే చర్యలు కొనసాగితే శాంతి చర్చలు సఫలం కావడం కష్టమని హెచ్చరించారు. పరస్పర గౌరవం, విశ్వాసం ఆధారంగా చర్చలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఇరాన్ తరఫున వచ్చిన ఈ స్పందనతో రెండు దేశాల మధ్య ఉన్న విభేదాలు మరింత స్పష్టమయ్యాయి. ఒకవైపు అమెరికా కఠిన వైఖరిని కొనసాగిస్తుండగా, మరోవైపు ఇరాన్ కూడా తన స్థానం నుంచి వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో రెండో విడత చర్చలు ఎప్పుడు జరుగుతాయన్నది అనిశ్చితంగా మారింది. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. మధ్యప్రాచ్యంలో స్థిరత్వం కోసం అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు కీలకంగా మారాయి. ఇరు దేశాలు పరస్పర రాజీ మార్గాలను అన్వేషిస్తాయా, లేక ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. మొత్తంగా చూస్తే, అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా చల్లారలేదు. చర్చలపై స్పష్టత లేకపోవడం, పరస్పర ఆరోపణలు, ఆంక్షల హెచ్చరికలు పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాంతి చర్చలు పునఃప్రారంభమవుతాయా లేదా అన్నది అంతర్జాతీయంగా ఆసక్తికరంగా మారింది.



# నెల బాలుడు నాదెండ్ల జీవితం...
# నేటితరం నేతలకు గుణపాఠం

నాదెండ్ల భాస్కర్ రావు జీవితం.. మరణం... ఆయన రాజకీయ జీవితంలో చేసిన రణాలు జీవిత చరమాంకంలో రాజకీయ విశ్లేషకులతో పంచుకున్న తన అనుభవాలు నేటితరం నేతలకు ఎన్నో గుణపాఠాలుగా పనికి వస్తాయి. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు. తన పేరులాగా కొద్దికాలం మాత్రమే ఉదయించి... రాజకీయ సాయంత్రాల తీరానికి వేగంగా చేరుకున్నారు. అద్భుత రాజకీయ చతురత. అపారమైన తెలివితేటలున్నా... కేవలం నెల రోజుల సీఎంగానే చరిత్రలో నిలిచిపోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే నెల బాలుడైన ఏకైక సీఎం ఉమ్మడి రాష్ట్రంలో నాదెండ్ల భాస్కర్ రావునే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెడ్లు, కమ్మల మధ్య రాజకీయ వైరానికి సుదీర్ఘ చరిత్రే ఉంది. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావ సమయంలో బెజవాడ గోపాల రెడ్డి, నీలం సంజీవరెడ్డి పోరాడితే మధ్యే మార్గంగా తనకు సీఎం వస్తుందని ఆశించిన ఆచార్య ఎన్జీ రంగాకు ఆశాభంగం కల్గింది. అప్పటి నుంచి కమ్మ కులస్థులు ముఖ్యమంత్రి పదవి అందని ద్రాక్షనే అయింది. ఆ పదవి పొందేందుకు ఉమ్మడి రాష్ట్రంలో కమ్మలు చాలా ఏండ్లు ఎదురుచూడాల్సి వచ్చింది. అది కాంగ్రెస్ పార్టీతో తమ వర్గం వారికి సీఎం పదవి రావడం సాధ్యం కాదని తెలిసి 1983లో రాష్ట్రంలో ఉన్న అదే సామాజికవర్గానికి చెందిన వ్యాపారశక్తులు సినీ నటుడు ఎన్టీఆర్‌ను తీసుకొచ్చి పార్టీ పెట్టించి సీఎం చేశారు. ఇక అదే సామాజికవర్గానికి చెందిన నాదెండ్ల భాస్కర్ రావు తన తెలివితేటలు, శక్తుయుక్తులతో ఎన్టీఆర్ ను సీఎం పీఠం నుంచి దించి పదవి లాక్కోవడాన్ని ఆ సామాజికవర్గంతో పాటు అన్ని వర్గాలు జీర్ణించుకోలేకపోయాయి. అందుకే, నాటకీయ పరిణామాల మధ్య మళ్ళీ ఎన్టీఆర్ నే సీఎం కావాల్సి వచ్చింది. వాస్తవానికి ఆయనకు కాలం కలిసి రాలేదు. భాస్కర్ రావులో తెలివితేటలు, చురుకుతనం, లీడర్‌షిప్ క్వాలిటీస్ అపారం. ఆయనకు లేనిదల్లా ఓర్పు, ఇసుమంతైన నేర్పు అని చాలా అంటుంటారు. ఆయన పని తీరు చాలా స్పీడు. రాజకీయ రంగస్థలంలో హీరో కావలసినవాడు. కానీ కాలేకపోయారు. ఆయన చనిపోయే వరకు కూడా నిండు ఎర్రటి పండులా కనిపించారు. అడిగిన ప్రతి యూట్యూబ్ ఛానల్ కి ఇంటర్వ్యూ ఇచ్చి పాత విషయాలు తలుచుకుంటూ మాజీ సీఎం ఎన్టీఆర్. ఏపీ ప్రస్తుత సీఎం చంద్రబాబులను విమర్శిస్తూ కాలక్షేపం చేశారు. కొంత చరిత్రను చర్చిద్దాం.


కృష్ణా, గుంటూరు జిల్లా కమ్మ హేమాహేమీలు అందరూ నాడు(197577లో) జలగం వెంగళరావు, కాసు బ్రహ్మానందరెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి వంటి రెడ్డి దిగ్గజాలతో పాటే రెడ్డి కాంగ్రెసు వైపు ఉండిపోయారు. 1978 ఎన్నికలలో ఇందిరా కాంగ్రెసుకు రాష్ట్రంలో అభ్యర్థులు దొరకని స్థితి. మాజీ ప్రధాని పి.వి. తర్వాత ఇందిరా కాంగ్రెసు నాయకత్వాన్ని తీసుకున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి దృష్టిలో నాదెండ్ల భాస్కర్ రావు పడ్డారు. కృష్ణా జిల్లా కేంద్ర స్థానమైన విజయవాడ తూర్పు నియోజకవర్గానికి ఆయనకు టిక్కెట్ ఇచ్చారు. భాస్కర్ రావు అప్పటికే హైదరాబాదులో మంచి ప్రాక్టీసు ఉన్న హైకోర్టు అడ్వకేట్. ఎక్కువగా పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ వంటి రాజకీయ సంబంధమైన కేసులు వాదించేవారు. ఆ ఎన్నికలలో ఆయన ఇందిర వేవ్ కారణంగా నాదెండ్ల భాస్కర్ రావు గెలిచారు. తొలిసారి ఎమ్మెల్యే ఆ వెంటనే మంత్రి కూడా అయిపోయారు. మొదటిసారి ఎం.ఎల్.ఏ. అయిన వారికి మంత్రి పదవులు ఇచ్చేది లేదన్న కాంగ్రెస్ సిద్ధాంతాన్ని నాదెండ్ల భాస్కర్ రావు విషయంలో సీఎం డాక్టర్ చెన్నారెడ్డి పక్కన పెట్టేశారు. అందుకు కారణం అప్పటి కృష్ణా జిల్లాలో రాజకీయ, సామాజిక సమతుల్యం చెయ్యాల్సిన పరిస్థితి. దాంతోపాటు, కమ్మ కులంలో కరువయిన నాయకత్వం. ఆనాటి కృష్ణా జిల్లాకు చెందిన కమ్మ కులంలోని ముఖ్య నేతలు పిన్నమనేని కోటేశ్వరరావు (జిల్లా పరిషత్ ఛైర్మన్), చనుమోలు వెంకట్రావు (మాజీ మంత్రి), కే.ఎల్.ఎన్. ప్రసాద్ (ఎంపీ, ఆంధ్రజ్యోతి అప్పటి పత్రికాధిపతి), కాపు కులంలోని ముఖ్య నేత మండలి వెంకట కృష్ణారావు వర్గం అంతా జలగంతో పాటు రెడ్డి కాంగ్రెస్‌లో ఉండిపోయారు. ఇందిరా కాంగ్రెస్ లో ఆ జిల్లా నుండి ఎవరు లేరు. దీంతో భాస్కర్ రావును చెన్నారెడ్డి మంత్రిని చేశారు. నిజానికి కమ్మ నేతలలో చాలామందికి లేని స్థానికత హైదరాబాద్‌లో నాదెండ్లకు ఉందని చెబుతుంటారు. హైదరాబాద్ నేతలు, తెలంగాణ నేతలు చాలామంది ఆయనకు బాగా తెలుసు. అందువల్ల ఆయనకు చెన్నారెడ్డి ప్రభుత్వంలో, హైదరాబాద్ రాజకీయాల్లో ప్రాధాన్యం పెరిగిపోయింది. చెన్నారెడ్డి కూడా నాదెండ్లకు చాలా ప్రాధాన్యత ఇచ్చారని చెబుతారు. హైదరాబాద్ సంబంధాలతో ఢిల్లీ నేతలను, అందులోనూ అప్పట్లో ఇందిరా కాంగ్రెస్ లో రాజకుమారుడిగా చలామణి అవుతున్న ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిన్న కుమారుడు సంజయ్ గాంధీతో బాగా పరిచయం పెంచుకున్నారు. సంజయ్ గాంధీతో నాదెండ్ల సాన్నిహిత్యంపై పలు పుకార్లు సైతం షికార్లు చేశాయి. దీంతో నాదెండ్ల భాస్కర్ రావు ఏదో చేస్తున్నాడన్న అనుమానం చెన్నారెడ్డిలో మొదలైంది. సన్నిహితుల వారింపుతో చెన్నారెడ్డి నాదెండ్ల భాస్కర్ రావు ను పక్కనబెట్టారు. అదే సమయంలో సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మరణించారు. దీంతో చెన్నారెడ్డి నాదెండ్లను పురావస్తుశాఖలో పడేశారు. అది ఏమాత్రం పనిలేని, రాజకీయంగా పసలేని శాఖననే విషయం అందరికీ తెలిసిందే... నాదెండ్ల శాఖ మార్పుపై Nadendla Dumped In Archives అని ఆరోజున డెక్కన్ క్రానికల్ పత్రిక అవహేళనగా హెడ్డింగ్ పెట్టి రాసింది. అది నాదెండ్ల భాస్కర్ రావుకు తీవ్ర ఆగ్రహం కల్గించిందని చెబుతుంటారు. అనంతర రాజకీయ పరిణామాల్లో భాగంగా ఆయన అసమ్మతివర్గంతో చేతులు కలిపారు. అప్పటి కే.జి. రాజారాం నేతృత్వంలో 15 మంది మంత్రులు చెన్నారెడ్డిపై తిరుగుబాటు చేసి వేరు కుంపటి పెట్టుకోగా, వారితో నాదెండ్ల జత కలిశారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించే దశలోనే చెన్నారెడ్డిని రాజీనామా చేయవలసిందిగా కాంగ్రెస్ అధిష్టానం ఆదేశించింది. ఇక తదుపరి ముఖ్యమంత్రి ఎవరవుతారా అని చూస్తున్న తరుణంలో తనను ఎంపిక చేస్తారని ఆశించిన నాదెండ్లకు మొండి చేయి ఎదురైంది. అంజయ్యను ముఖ్యమంత్రి పదవి వరించింది. దీనిని నాదెండ్ల సహించలేకపోయారని అప్పుడు రాజకీయాలను దగ్గరి నుంచి చూసిన రాజకీయ విశ్లేషణకులు, నేతలు చెబుతుంటారు. అంజయ్యను నాదెండ్ల చులకనగా చూడటం మొదలుపెట్టారు. దీంతో సీఎం అంజయ్య ఆయనను పక్కన పెట్టేశారు. ఇలా రెండేళ్లకు పైగా ప్రభుత్వంలో హీరోగా చక్రం తిప్పిన నాదెండ్ల 1981 వచ్చేసరికి జీరోగా మిగిలిపోయారు. అయినా నాదెండ్లది మౌనంగా సహించి వూరుకునే తత్వం కాదు. రాజకీయాలలో ఆయన కదలికలు పాదరసం మాదిరి ఉంటాయి. అవకాశం కోసం ఎదురు చూస్తున్న ఆయనకు ఎన్.టి.ఆర్. తారసపడ్డారు. తెలుగుదేశం ఆవిర్భావంలో ఆయన తనవంతుగా గట్టి పాత్ర పోషించారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రి అయ్యారు. ఈయన ఆర్థికమంత్రి అయ్యారు. కానీ ఆయనకు ఎన్.టి.ఆర్. అంటే పెద్దగా గౌరవం లేదు. తన మీద తనకు నమ్మకం ఎక్కువ. ముఖ్యమంత్రి పీఠంపై మోజు ఎక్కువ. అవకాశం కోసం ఆయన ఎదురుచూశారు. గుండె ఆపరేషన్‌కు ఎన్టీఆర్ అమెరికా వెళ్లగానే నాదెండ్ల అసమ్మతి శిబిరం ఏర్పాటు చేశారు. నాదే అసలైన తెలుగుదేశం అని అప్పటి గవర్నర్ రామ్ లాల్ కి చెప్పారు. తన చిరకాల స్వప్నమైన ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. కానీ అవసరమైన సంఖ్యలో శాసనసభ్యుల మద్దతు సంపాదించలేకపోయారు. అప్పటి కేంద్ర ప్రభుత్వంపై, రాజ్ భవన్‌పైనా ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. ఈలోపు అమెరికా నుంచి ఎన్టీఆర్ తిరిగి వచ్చారు. ప్రజల్లోకి వెళ్లిపోయారు. అప్పుడు రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఉన్న కమ్యూనిస్టులు, బీజేపీ, ఇతర విపక్ష శక్తులన్నీ రామారావుకు అండగా నిలిచాయి. ప్రజలు సైతం ఎన్టీఆర్‌కు మద్దదుగా నిలిచారు. 40 మందికి లోపే ఎమ్మెల్యేలు నాదెండ్లకు మద్దతుగా నిలవడం. కాంగ్రెస్‌తో కలుపుకున్నా 100 మంది శాసనసభ్యుల మద్దతు లేకపోవడం. ఇదే తరుణంలో తప్పుడు నివేదికలతో కొంత ఇబ్బందులు ఏర్పడిన విషయాన్ని గుర్తించిన ప్రధాని ఇందిరా గాంధీ, కొత్త గవర్నర్ గా శంకర్‌దయాళ్ శర్మను రాష్ట్రానికి పంపింది. ఆయన సమగ్ర నివేదికతో ఇందిరాగాంధీ మనస్సు మార్చుకోవడంతో నాదెండ్ల ముఖ్యమంత్రిత్వం నెల రోజుల్లోనే ముగిసిపోయింది. ఆ నెల రోజుల్లోనే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58కి పెంచారు. అదే సమయంలో రెండు చేతులతో సంతకాలు చేస్తూ నాలుగు రాళ్లు వెనకేసారని ఆరోపణలు సైతం భాస్కర్ రావు మూటగట్టుకున్నారు. 1985 ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రిగా ఓడిపోయిన ఆయన, 1989లో తన సొంత నియోజకవర్గం తెనాలి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1994లో అక్కడే టీడీపీ నేత రావి రవీంద్రనాథ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా గెలిచారు. 1999లో సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయనను కాదని రేణుకా చౌదరికి ఖమ్మం సీటు కాంగ్రెస్ అధిష్టానం టిక్కెట్ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసిన నాదెండ్ల బీజేపీ నేత దత్తాత్రేయ చేతిలో ఓటమిపాలయ్యారు. దాంతో ఆయన ఎన్నికల రాజకీయ ప్రస్థానం ముగిసింది. తర్వాత బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్, ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలోని రెండు రాజ్యాంగబద్ధ పదవులు నిర్వహించిన తండ్రి కొడుకుల్లో వీరు మాత్రమే చరిత్రలో ఉన్నారు. ప్రస్తుతం నాదెండ్ల మనోహర్, ఏపీ ప్రభుత్వంలో క్రియాశీలకమైన మంత్రిగా ఉన్నారు. జనసేనాని, ఏపీ డిప్యూటీ సి.ఎం. పవన్ కల్యాణ్ కు కుడిభుజంగా నిలబడిన విషయం తెలిసిందే. అయితే, నిజంగా నాదెండ్ల భాస్కర్ రావు నమ్మకంగా చెన్నారెడ్డి వెంట లేదా ఎన్టీఆర్ పక్కన నిలబడి ఉంటే, వారికి కుడిభుజంగా ఉంటే మరెంతో కాలం క్రియాశీల రాజకీయాలలో వైభవంగా వుండేవారేమో విశ్లేషకులు చెబుతుంటారు. రాజకీయాల్లో తెలివితేటల కంటే ఓర్పు చాలా అవసరమని... అదే ఆయన జీవితం నుంచి నేటి తరం నాయకులు నేర్చుకోవాల్సిన అనివార్యత ఉందన్న విషయాన్ని గుర్తెరగాలి. ఆఖరి వరకు ఎన్టీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తూనే ఆయన జీవితం ముగించారు. అయితే, ఇన్ని రాజకీయ ఒత్తిళ్ల నడుమ ఆయనకి ఒక చిన్న స్వాంతన ఏంటి అంటే... ఆయన కుమారుడు ఒక రాజకీయంగా నిలదొక్కుకోవడం. ఎంతోమంది సుదీర్ఘ కాలం ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులుగా పని చేసిన వారి పిల్లలు కూడా నేడు రాజకీయ కదనరంగంలో ఎలా కంగు తింటున్నారో మనం చూస్తునే ఉన్నాం కదా.





**సాగర్ వనపర్తి, పొలిటికల్ అనలిస్టు.**


# నిరాశావాదాన్ని వీడండి.. వ్యవస్థను లోపలి నుండే గెలవండి!



మన చుట్టూ ఉన్న వ్యవస్థ గురించి మాట్లాడేటప్పుడు అది రంగుల లోకమైన సినిమా రంగమైనా, నిబద్ధతతో కూడిన విద్యా వ్యవస్థైనా, లేదా అధికారం చుట్టూ తిరిగే రాజకీయ చట్రమైనా చాలా మంది నోట వినిపించే పల్లవి ఒక్కటే, వ్యవస్థ భ్రష్టు పట్టిపోయింది ఇక్కడ మార్పు అసాధ్యం. ఈ నిరాశావాదం ఇప్పుడు ఒక ట్రెండ్ గా మారిపోయింది. సాయంత్రం వేళ చాయ్ కొట్టు చర్చల్లో, కళాశాల క్యాంపస్‌ల సందడిలో, లేదా వేలమంది చూసే సోషల్ మీడియా పోస్ట్‌లలో సిస్టం అంతే భయ్యా, నువ్వు ఏం చేసినా అది మారదు అనే నిట్టూర్పులు గాలిలో తేలుతూ ఉంటాయి. కానీ, ఆలోచించండి.ఈ నిరాశావాదం నిజంగా పచ్చి నిజమా? లేక మనం బాధ్యత నుండి తప్పించుకోవడానికి, మార్పు దిశగా అడుగు వేయడానికి భయపడి మనమే అల్లుకున్న ఒక రక్షణ కవచమా?ఈ చిక్కుముడిని విప్పే ముందు, మనం ఒక ప్రాథమిక సత్యాన్ని అర్థం చేసుకోవాలి: అసలు వ్యవస్థ అంటే ఏమిటి? వ్యవస్థ అంటే ఇటుకలు, రాళ్లతో కట్టిన ఒక నిర్జీవమైన గోడ కాదు. వ్యవస్థ అంటే మనుషులు, వారి మస్తిష్కాల్లో మెదిలే ఆలోచనలు, తరతరాలుగా అలవాటు పడిన పద్ధతులు, మరియు మనమందరం మౌనంగా ఇచ్చే సమ్మతి. మనుషులు మారగలిగే సత్తా ఉన్నప్పుడు ఆ మనుషులు సృష్టించిన వ్యవస్థ మారకుండా మొండికేయడం సాధ్యమా? అస్సలు కాదు.ఒక్కసారి గనుక నువ్వు ఆ వ్యవస్థలో అడుగుపెట్టావో అది నిన్ను తన రంగులో కలిపేసుకుంటుంది, నిన్ను మింగేస్తుంది అని పెద్దలు హెచ్చరిస్తుంటారు. ఈ మాటలో కొంత చేదు నిజం లేకపోలేదు. ఎంతో ఉత్సాహంతో, నిజాయితీతో వెళ్ళిన వ్యక్తులు కూడా కాలక్రమేణా పరిస్థితులకు తలవంచి రాజీ పడిపోవడం మనం గమనిస్తూనే ఉంటాం. అయితే, ఇది ఒక రాసిపెట్టిన నియమం కాదు. ఇదొక సవాలు మాత్రమే. ప్రమాదం ఉందని తెలిసి వెనక్కి తగ్గడం పిరికితనం అవుతుంది ఆ ముప్పును కళ్ళలోకి చూస్తూ, ఎదురొడ్డి నిలబడటమే అసలైన సాహసం, అసలైన హీరోయిజం .చరిత్ర పుటలను ఒక్కసారి వెనక్కి తిరగేస్తే, మనకు వెలుగుతూ కనిపించే నక్షత్రాలెన్నో ఉన్నాయి. బాబాసాహెబ్ అంబేద్కర్ వ్యవస్థలో భాగంగానే ఉన్నారు ఒక గొప్ప న్యాయనిపుణుడిగా, రాజ్యాంగ నిర్మాతగా ఆయనే గనుక లోపలి నుండి పనిచేయకపోతే, ఈరోజు మనం అనుభవిస్తున్న సమానత్వం సాధ్యమయ్యేదా? ఈ.వి. రామస్వామి పెరియార్ వంటి విప్లవకారులు కేవలం బయటి నుండి గొంతెత్తడమే కాదు, లోపలి సంస్కరణల కోసం ప్రాణాలొడ్డారు. మన తెలుగు గడ్డపై కూడా బాబాసాహెబ్ ఆశయాలను గుండెల్లో నింపుకున్న ఎందరో అజ్ఞాత వీరులు వ్యవస్థలో ఉంటూనే, గొంగళిలో పురుగుల్లాంటి అవినీతిని ఏరిపారేశారు. కాబట్టి, వ్యవస్థలో చేరడం అంటే ఆత్మవంచన చేసుకోవడం కాదు. అది ఒక గొప్ప వ్యూహం శత్రువు కోటలోకి ప్రవేశించి, లోపలి నుండి తలుపులు తెరిచి మార్పు అనే సైన్యాన్ని ఆహ్వానించడం వంటి రాజనీతి. తప్పులు వెతకడం చాలా సులభం, కానీ సరిదిద్దడమే కష్టం అనే సామెత అందరికీ తెలిసిందే. కానీ నేటి కాలంలో మనం ఇంకొంచెం లోతుగా ఆలోచించాలి. బయటి నుండి విమర్శించడం అనేది ఒక విలాసం, లోపలి నుండి మార్చడం అనేది ఒక యజ్ఞం. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ విధానాలను ఎండగట్టే వారు లక్షల్లో ఉంటారు. కానీ వారిలో ఎంత మంది తమ వీధిలోని మురుగుకాల్వ సమస్యపై స్థానిక స్వపరిపాలనలో భాగమవుతున్నారు? ఎంత మంది ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కమిటీల్లో బాధ్యత తీసుకుంటున్నారు? ఒక సామాన్య సర్కారు ఆసుపత్రిలో రోగులకు అందే సేవలను మెరుగుపరచడానికి ప్రత్యక్షంగా చెమటోడుస్తున్నారు?విమర్శకు ఖచ్చితంగా శక్తి ఉంది అది చైతన్యాన్ని రగిలిస్తుంది, నిద్రిస్తున్న సమాజాన్ని మేల్కొల్పుతుంది. కానీ విమర్శ అనేది కేవలం ప్రయాణానికి పునాది మాత్రమే. ఆ విమర్శకు ఒక గమ్యం ఉండాలి అంటే, అది మార్పు గా రూపాంతరం చెందాలి. అందుకే వ్యవస్థలో ప్రవేశించి, ఆ మురికిని కడిగేయడం అనేది కేవలం ఒక పద్ధతి మాత్రమే కాదు, అది ఒక పౌరుడిగా మనకున్న నైతిక బాధ్యత.వ్యవస్థలో ఉండి ఒక వ్యక్తి ప్రభావాన్ని చూపించాలంటే కేవలం ఆవేశం ఉంటే సరిపోదు, అంతులేని ఆలోచన ఉండాలి. చరిత్రలో వ్యవస్థలను మార్చిన వారు అనుసరించిన ఐదు సూత్రాలు ఇవే, వ్యవస్థలోకి వెళ్ళే ముందే మీ ఆశయం ఏమిటో మీకు స్పష్టంగా తెలియాలి. సమాజం బాగుపడాలి వంటి గాలి మాటలు కాకుండా, ఈ మండలంలో అక్షరాస్యతను 20% పెంచుతాను లేదా ఈ ఆఫీసులో లంచం లేకుండా సర్టిఫికెట్లు ఇప్పిస్తాను అనే ఖచ్చితత్వం ఉండాలి. స్పష్టత లేకపోతే, వ్యవస్థే మిమ్మల్ని తన స్వార్థం కోసం ఒక పావులా వాడుకుంటుంది. మార్పు అనేది ఓవర్ నైట్ రాదు. ఆగ్రహంతో ఊగిపోతూ నిజాలు చెప్పడం కంటే, నిలకడగా, సంయమనంతో వాస్తవాలను ఎత్తిచూపడం ఎక్కువ ఫలితాన్నిస్తుంది. ఉవ్వెత్తున ఎగిసిపడే అల కంటే, నిరంతరం రాయిని తాకే నీటి చుక్కకే ఆ రాయిని పిండి చేసే సత్తా ఉంటుంది. వ్యవస్థలో ఒంటరి పోరాటం చేయడం అంటే ఆత్మహత్యతో సమానం. మీ ఆలోచనలతో ఏకీభవించే వారిని వెతకండి. విభిన్న విభాగాల్లోని వ్యక్తులతో సత్సంబంధాలు పెంచుకోండి. ఒక టీమ్ లా పని చేసినప్పుడు మీ శక్తి వంద రెట్లు పెరుగుతుంది. వ్యవస్థ ఒత్తిడిలో మీ ఆత్మగౌరవాన్ని, విలువలను పణంగా పెట్టకండి. ప్రలోభాలు, బెదిరింపులు, పదవీ వ్యామోహాలు ఎన్నో ఎదురవుతాయి. కానీ ఒక్కసారి మీరు రాజీ పడితే, మీరు వ్యవస్థను మార్చే లీడర్ స్థానాన్ని కోల్పోయి, అదే వ్యవస్థలో ఒక సామాన్య మరమనిషిగా మిగిలిపోతారు. వ్యవస్థతో యుద్ధం చేసేటప్పుడు ఎదురుదెబ్బలు తగులుతుంటాయి. మీరు ప్రవేశపెట్టిన ఒక మంచి సంస్కరణ రద్దు కావచ్చు. అంత మాత్రాన నీరసపడిపోకూడదు. ప్రతి ఓటమి ఆ వ్యవస్థలోని లోపాలను మీకు మరింత క్షుణ్ణంగా నేర్పిస్తుంది.

నేటి తెలుగు సమాజంలో ఒక ఆసక్తికరమైన వైరుధ్యం కనిపిస్తోంది. ఒకవైపు మన యువత గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల్లో అగ్రస్థానాల్లో కూర్చుంటున్నారు, స్టార్టప్‌లతో ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నారు. మరోవైపు, సామాజిక వ్యవస్థల మీద, రాజకీయాల మీద ఒక రకమైన విరక్తిని పెంచుకుంటున్నారు. అంతా అవినీతిమయం మనకెందుకులే అనే ధోరణి ప్రమాదకరంగా మారుతోంది.కానీ ఒక్కసారి లోతుగా పరిశీలిస్తే మన మధ్యే ఉంటూ నిశ్శబ్దంగా విప్లవాలు సృష్టిస్తున్న వారు లేరా? గ్రామ పంచాయతీల్లో ఐటీ ఉద్యోగాలను వదిలి వచ్చి సర్పంచులుగా మారి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్న యువకులు ఉన్నారు. నిబద్ధతతో పనిచేసే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సామాన్యుల కోసం తపిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు నేటికీ ఉన్నారు. వీరి గురించి మీడియాలో రచ్చ జరగదు, ఎందుకంటే వ్యవస్థ సరిగ్గా నడుస్తోంది అన్నది నేటి కాలంలో వార్త కాదు. మన యువత గనుక ఈ రంగాలకు దూరంగా ఉంటే, ఆ ఖాళీని ఎవరు పూరిస్తారు? మళ్ళీ అవినీతిపరులే ఆ స్థానాలను ఆక్రమిస్తారు. అందుకే వ్యవస్థ నుండి పారిపోవడం పరిష్కారం కాదు అందులోకి చొచ్చుకెళ్లి దాన్ని ప్రక్షాళన చేయడమే అసలైన విధి.మన సమాజంలో మార్పు అంటే ఏదో ఒక విప్లవం వచ్చి, ఒక్క రాత్రిలో ప్రపంచం మారిపోవాలి అనే భ్రమ ఉంది. కానీ నిలకడైన మార్పు అలా రాదు. అది ఒక భవనంలా నిర్మించబడాలి. ఒక టీచర్ తన క్లాసులో పిల్లలను కేవలం మార్కుల కోసం కాకుండా, ఆలోచించడం కోసం ప్రోత్సహిస్తే అది వ్యవస్థలో ఒక మార్పే. ఒక పోలీసు అధికారి ఒక పేదవాడి ఫిర్యాదును చిరునవ్వుతో స్వీకరిస్తే అది కూడా గొప్ప మార్పే. ఒక డాక్టర్ రోగికి కేవలం మందులే కాకుండా కొంచెం భరోసా ఇస్తే అది కూడా వ్యవస్థను మార్చడమే. చిన్న చిన్న మార్పులన్నీ కలిసినప్పుడే అది ఒక మహా ప్రభంజనం అవుతుంది. నదిలోని ప్రతి నీటి చుక్కకు విడిగా గుర్తింపు ఉండకపోవచ్చు, కానీ ఆ చుక్కలన్నీ కలిస్తేనే అది జీవనది అవుతుంది, సముద్రాన్ని చేరుతుంది.

ఈ వ్యాసం చివరగా మిమ్మల్ని అడిగే ప్రశ్న ఒక్కటే మీరు ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఉండాలనుకుంటున్నారా లేక కేవలం ఒక ప్రేక్షకుడిగా మిగిలిపోవాలనుకుంటున్నారా? నిరాశావాదం చాలా కంఫర్టబుల్ గా ఉంటుంది. ఏమీ మారదు అని ఒక ముద్ర వేసేస్తే, మనం కష్టపడాల్సిన అవసరం ఉండదు, బాధ్యత తీసుకోవాల్సిన పని ఉండదు. కానీ ఆశావాదం అనేది ఒక సాహసం. ఫలితం ఎలా ఉన్నా, నేను మార్పు కోసం నా వంతు ప్రయత్నం చేస్తాను అని నిలబడటానికి వెన్నుముక కావాలి.డాక్టర్ అంబేద్కర్ ఒక సందర్భంలో అన్నట్టు,నేను సమాజానికి నచ్చే పనులు చేస్తున్నానా లేదా అన్నది ముఖ్యం కాదు, నేను సమాజాన్ని మెరుగుపరిచే పనులు చేస్తున్నానా లేదా అన్నదే ముఖ్యం. ఈ మాటలు మనకు దిక్సూచి కావాలి. వ్యవస్థ మారుతుందా? ఖచ్చితంగా మారుతుంది. అది ఎప్పుడు మారుతుంది? మనం మారినప్పుడు. మనం మారకపోతే ఈ ప్రపంచంలో ఏ వ్యవస్థా మారదు. ఎంపిక మన చేతుల్లోనే ఉంది. విమర్శించే వేళ్లుగా మిగిలిపోదామా? లేక మార్పును నడిపించే చేతులుగా మారుదామా? ఆలోచించండి!



**డా .సూర్యదేవర రామకృష్ణ , 9490754169**

# హైకోర్టు తీర్పుతో నిజం వెలుగులోకి – గోబెల్స్ ప్రచారం పటాపంచలు

- **కాళేశ్వరం పై కాంగ్రెస్ ఆరోపణలకు చెక్ – ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

ఏఎస్ రావు నగర్, ఏప్రిల్ 23 (వెలుతురు ప్రతినిధి):



ఏఎస్ రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు ఇకపై చెల్లుబాటు లేదని, దానిపై తదుపరి చర్యలు తీసుకోవడానికి వీల్లేదని హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన హర్షం వ్యక్తం చేశారు.

"నిజం ఎప్పటికైనా వెలుగులోకి వస్తుందనే నానుడిని హైకోర్టు మరోసారి నిరూపించింది" అని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేసిన "గోబెల్స్ ప్రచారం" ఈ తీర్పుతో పూర్తిగా బట్టబయలైందని విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల రాష్ట్రంలో మళ్లీ తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ట్యాంకర్లపై ఆధారపడే పరిస్థితి తిరిగి వచ్చిందని ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై కూడా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రజల సమస్యలపై అవగాహన లేకపోవడం, పరిపాలనలో అనుభవం లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్‌లోని సెక్షన్ 8(బి) ప్రకారం, ఎవరిపై అయినా ఆరోపణలు మోపే ముందు వారి అభిప్రాయాలను నమోదు చేయాల్సి ఉండగా, ఆ ప్రక్రియను పూర్తిగా విస్మరించారని లక్ష్మారెడ్డి ఆరోపించారు. నివేదిక పూర్తికాక ముందే అసెంబ్లీలో చర్చించడం, మీడియాకు లీకులు ఇవ్వడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని అన్నారు.

విచారణ మొత్తం లోపభూయిష్టంగా సాగిందని, సహజ న్యాయ సూత్రాలను పక్కన పెట్టి ఏకపక్షంగా నివేదిక రూపొందించారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద చల్లి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును బద్నాం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపించారు.

"విచారణకు మేము వ్యతిరేకం కాదు. కానీ అది పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలి. కమిషన్‌ల పేరుతో కక్ష సాధింపు రాజకీయాలు చేయడం సమంజసం కాదు" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలి

- **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 23:



127 రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శ నగర్ లోని శ్రీశ్రీశ్రీ అలర్మేల్ మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం 28వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు.

ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎర్ర శంకరయ్య, నాయకులు చంద్రశేఖర్, నాగభూషణం, రవికుమార్, ఎర్ర సాయికిరణ్ (బంటి), శ్రీను, శివలాల్, జల్దా లక్ష్మీనాధ్, ఓంకార్ రెడ్డి, క్రాంతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు



- **సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి**

కూకట్ పల్లి, ఏప్రిల్ 23 వెలుతురు:

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సీపీఎం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్చలు ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కూకట్ పల్లి నియోజకవర్గంలోని కూకట్ పల్లి డిపో ఎదుట ఏప్రిల్ 22 నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మె చేపట్టిన నేపథ్యంలో సీపీఎం నేతలు వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్, కూకట్ పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని వారు విమర్శించారు. ఫిబ్రవరి 24న నిర్వహించిన 'చలో ఇందిరా పార్క్' కార్యక్రమం అనంతరం కార్మిక సంఘాలు ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన పరిష్కారం రాలేదని తెలిపారు. కార్మికులు 45 రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చినా, ప్రభుత్వం చర్చలకు ముందుకు రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఆర్టీసీ సేవలను ప్రైవేట్ బస్సులతో నిర్వహిస్తామని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లలో సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం, ప్రైవేటీకరణను నిలిపివేయడం, ఎలక్ట్రిక్ బస్సులను కాంట్రాక్టు విధానంలో కాకుండా ప్రభుత్వం స్వయంగా కొనుగోలు చేసి నిర్వహించడం వంటి అంశాలు ఉన్నాయని తెలిపారు. ఈ విధంగా చేస్తే సంస్థ బలోపేతం అవుతుందని, కార్మికులకు భద్రత కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, పదవీ విరమణ చేసిన కార్మికులకు గత రెండు సంవత్సరాలుగా బకాయి ఉన్న గ్రాచ్యుటీ, ఇతర ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఏ. విజయ, ధర్మరావు, రాములు, సత్తయ్య, జోగారావు, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్ల తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు చేపట్టిన జిలవర్ష రాములు

మంచాల వెలుతురు ఏప్రిల్ 23:



మంచాల మండలం ఆరుట్ల గ్రామంతెలంగాణ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) నూతనంగా ప్రి న్సిపాల్ బాధ్యతలు చేపట్టిన జిలవర్ష రాములు నూతనంగా ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టిన రా ములును పాఠశాల సిబ్బంది విద్యార్థులు స్వాగతం పలికి ప్రిన్సిపాల్ గారికి అభినందనలు తెలియ జేశారు ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రాములు మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్యను అం దించడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు విద్యార్థుల సమగ్ర అభి వృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ క్రమశిక్షణ సాంకేతిక విద్య నైతిక విలువల పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు పాఠశా లను మరింత అభి వృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు,తల్లిదండ్రుల సహకారం అవసర మని ఆయనఅభిప్రాయపడ్డారు ఈసందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులు విద్యాసి బ్బంది రాములు గారికి శుభాకాంక్షలు తెలియజేశారు ఈకార్యక్రమంలో తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు తదితరులు

# గంగను భూమికి తీసుకొచ్చేందుకు భగీరథుడు చేసిన త్యాగం సేవాభావానికి నిత్యస్ఫూర్తి

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 23:



భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని జగద్గిరిగుట్టలో నిర్వహించిన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిధిగా హాజరై భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి సంరక్షణకై గంగను భూవిపైకి తీసుకొచ్చేందుకు భగీరథుడు చేసిన త్యాగం సేవాభావానికి నిత్యస్ఫూర్తి అని, భగీరథుడి సంకల్పం మన పనిలో అసాధ్యం కానిది ఏది లేదనే విషయాన్ని తెలియజేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట సగర సంఘం అధ్యక్షులు సుదర్శన్ సాగర్, వైస్ చైర్మన్ రాములు సాగర్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్ భీమయ్య సాగర్, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు కొండయ్య సాగర్, రామకృష్ణ సాగర్, బాబు గౌడ్, పాపులు గౌడ్, విటల్, దాసు, మల్లేష్ గౌడ్, శశిధర్ ముదిరాజ్, ప్రభాకర్, మెట్ల శీను, గోపాల్, మహేందర్, నాని, ముంతాజ్, అంజి, భూపతి రెడ్డి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి: సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్.

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 23:



ఆర్టీసీ కార్మికుల రెండో రోజు సమ్మెలో భాగంగా నేడు జీడిమెట్ల డిపో ఎదురుగా జరిగిన ఆర్టీసీ కార్మికుల ఆందోళనకు సిపిఐ మరియు ఏఐటీయుసీ నాయకులు మద్దతు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వంలో విలీనం చేస్తామని, పెండింగ్లో ఉన్న రెండు పీఆర్సీలను ఇస్తామని, యూనియన్ లను పునరుద్ధరిస్తామని తదితర 32 హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ వాటి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని, గత సంవత్సర కాలంగా ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి విన్నవిస్తుంటే పట్టించుకోకపోవడం వల్లే నేడు ఆర్టీసీ కార్మికులు అనివార్యంగా సమ్మెళకు వెళ్లాల్సి వచ్చిందని దీన్ని విచ్చిన్నం చేయడానికి ప్రభుత్వము అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ కార్మికులు కష్టనష్టాలను ఓర్చుకొని సమ్మెను విజయవంతం చేస్తున్నారని ఈ సమ్మె ఒక చారిత్రాత్మకంగా మిగిలిపోయేలా కావాలని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దాన్ని కార్మికులపై నెట్టడం అన్యాయమని దాని బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది కాబట్టి వెంటనే చర్చలకు పిలిచి కార్మికులకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మరియు ఏఐటియుసి ఇతర అనుబంధ సంఘాలన్నీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని వారి ఉద్యమాలలో కూడా రానున్న రోజుల్లో స్వయంగా పాల్గొంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ మండల కార్యదర్శి కే స్వామి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు,మండల సహాయ కార్యదర్శి హరినాథ్ మాట్లాడుతూ సమ్మె కార్మికులకు కొత్త కాదని ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకుగురిచేసినప్పటికీసమ్మెలోఅందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేస్తున్నారని, సమ్మెను విజయవంతం చేసుకునే బాధ్యత కార్మిక లోకానికి ఉందని వారికి పూర్తిగా సిపిఐ మరియు ఏఐటీయూసీ సహకరిస్తుందని అన్నారు .ఈకార్యక్రమంలోప్రజానాట్యమండలిఅధ్యక్షులు బాబు ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాస్, జేఏసీ నాయకులురాజు,ఎంప్లాయిస్‌యూనియన్‌కార్యదర్శిడానియల్‌నాయకులుగోవర్ధన్‌గీతఖయ్యూం రాజేష్‌నారాయణ నాతో పాటు వందలాది మంది ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ బండలో ఘనంగా రేణుక ఎల్లమ్మ–పోచమ్మ తల్లి ఆలయ గర్భగుడి భూమిపూజ



కూకట్ పల్లి ఏప్రిల్ 23 వెలుతురు:

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్ నగర్ లోని శ్రీ రేణుక ఎల్లమ్మ-పోచమ్మ తల్లి దేవాలయ గర్భగుడి భూమిపూజ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్ నేత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయం అందించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం స్థానిక ప్రజలతో పాటు దాతల సహకారం అత్యవసరమని పేర్కొన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించి తమవంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఆనంద్, భాలస్వామి, అగ్రవాసు, సంగమేష్, కార్తీక్, రవీందర్, సుధాకర్, ఫాండు తదితరులు పాల్గొన్నారు.

# కాప్రాలో కార్మిక ఐక్యతకు నాంది

- **17 ఏళ్ల తర్వాత బి.ఎం.ఎస్ కొత్త కమిటీ, హక్కుల కోసం పోరాటాలు పునఃప్రారంభం**

కాప్రా, ఏప్రిల్ 23 (వెలుతురు ప్రతినిధి):



కాప్రా సర్కిల్ పరిధిలో ప్రైవేట్ ఉద్యోగుల సంఘటిత శక్తిని బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. భారతీయ మజ్దూర్ సంఘ్ (బి.ఎం.ఎస్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ప్రైవేట్ ఉద్యోగుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2007 తర్వాత తొలిసారిగా కొత్త కార్యవర్గం ఏర్పడటం కార్మిక వర్గంలో ఉత్సాహాన్ని నింపింది.

ఈ సమావేశానికి బి.ఎం.ఎస్ ఆల్ ఇండియా భాగ్యనగర్ విభాగం ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. భాగ్యనగర్ మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, సలహాదారులు భిక్షపతి, నరేష్‌లు పాల్గొని నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు.

**నూతన కమిటీ ఇలా...**

ఈ ఎన్నికల్లో బి. రాజకుమార్‌ను అధ్యక్షుడిగా, ఎస్. అబుల్‌ను ప్రధాన కార్యదర్శిగా, ఎ. యాదగిరిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అదనపు కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా ఎల్లయ్య బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంఘ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.

**సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తాం: నాయకులు**

ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులు కాప్రా పరిధిలో గత 17 సంవత్సరాలుగా ప్రైవేట్ ఉద్యోగులకు సమర్థవంతమైన యూనియన్ లేకపోవడం వల్ల అనేక సమస్యలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ మరియు అవుట్‌సోర్సింగ్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కులు తరచూ ఉల్లంఘనకు గురవుతున్నాయని పేర్కొన్నారు.

కార్మికుల శ్రమను దోపిడీ చేయాలని చూసే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేలా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగికి చట్టబద్ధంగా అందాల్సిన పి.ఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్), ఈ.ఎస్.ఐ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్) వంటి కనీస సౌకర్యాలు తప్పనిసరిగా అందేలా ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా యూనియన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

**కార్మిక సంక్షేమమే లక్ష్యం:నూతన కార్యవర్గం**

అనంతరం మాట్లాడిన నూతన కమిటీ సభ్యులు తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని, వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్మిక సంక్షేమం, ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రతా పథకాల అమలు వంటి అంశాలపై రాజీ పడకుండా పోరాడుతామని స్పష్టం చేశారు. కాప్రా సర్కిల్‌లోని ప్రతి ప్రైవేట్ ఉద్యోగికి ఈ యూనియన్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు .ఈ కొత్త కార్యవర్గం ఏర్పాటుతో కాప్రా ప్రాంతంలో కార్మిక ఉద్యమాలకు కొత్త ఊపు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తాం : బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 23:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో గురువారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ వాంబే హౌస్ కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు నూతన వీధి దీపాలు ఏర్పాటుచేసి అంతర్గత సిసి రోడ్లను నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే కి విన్నవించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వాంబే హౌస్ కాలనీలో ఇప్పటికే అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని ప్రస్తుత పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రానున్న రోజుల్లో బాంబే హౌస్ కాలనీలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో బాంబే హౌస్ కాలనీ అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి, మౌనిక, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపులు గౌడ్, విటల్, దాసు, మల్లేష్‌గౌడ్, శశిధర్ ముదిరాజ్, ప్రభాకర్, మెట్ల శీను, సాయి తేజ, గోపాల్, మహేందర్, నాని, ముంతాజ్, అంజి, భూపతి రెడ్డి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారుల పొట్టకొట్టకండి

**:జోనల్ కమిషనర్ కి సిపిఐ వినతి**

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 23:



99 రోజుల్లో పాలనలో భాగంగా రోడ్డుపైన ఫుట్పాత్ల పైన వ్యాపారం చేసుకుంటున్నటువంటి వీధి వ్యాపారులను తొలగించడం వల్ల వాళ్లు ఉపాధి కోల్పోయి వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి అలాంటి ఆలోచనలను విరమించుకొని వాళ్లకు భరోసా ఇవ్వాలని కోరుతూ నేడు కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్‌కుమార్‌నికలిసివినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ తో మాట్లాడుతూ రంగారెడ్డి నగర్ గాంధీనగర్ లలో రోడ్డుకు 10 ఫీట్లకు దూరంలో గత 30 సంవత్సరాల నుంచి ప్రభుత్వం చే గుర్తింపు పొందినటువంటి వీధి వ్యాపారి కార్డును కలిగి వారు తమ జీవితాలను వెళ్ళదీసుకుంటున్నారని వాళ్లపై నేవారికుటుంబాలు,వాళ్ళపిల్లలచదువులుఅన్నిఆధారపడి ఉన్నాయికాబట్టివారినితొలగించద్దని కోరడం జరిగింది. వీరి వ్యాపారం వల్ల ప్రజలకు గాని ట్రాఫిక్ గాని ఇలాంటి ఇబ్బంది లేదు కాబట్టి మానవతా దృక్పథంతో వీళ్లను తొలగించవద్దని అనివార్య పరిస్థితులు ఏర్పడితే వారికి ప్రత్యామ్నాయం చూపించాకే తొలగించాలని కోరారు. జోనల్ కమిషనర్ పింకేస్ మాట్లాడుతూ వీధి వ్యాపారాలు తొలగించడం తమ ఉద్దేశం కాదని రేపు అక్కడ పర్యటన చేసి తొలగించేలా వద్దా అని నిర్ణయిస్తామనిసిపిఐమరియువీధివ్యాపారులకు చెప్పడం జరిగింది.ఈకార్యక్రమంలోసిపిఐజిల్లా కార్యదర్శి ఉమామహేష్‌మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు వీధి వ్యాపారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జావిద్, యాదగిరి వీధి వ్యాపారులు చాంద్, ఖాన్, మహేష్, శ్రీపతి, జుబేర్,ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లిలో ఆధ్యాత్మిక మహోత్సవం ఘనంగా గరుడ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్టాపనకు భారీ ఊరేగింపు...



కూకట్ పల్లి, ఏప్రిల్ 23 వెలుతురు:

కూకట్ పల్లిలో ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించే అరుదైన మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో 27 అడుగుల గరుత్మంతుడు (గరుడ), ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విగ్రహాల మహా ఊరేగింపు కూకట్ పల్లి పురవీధుల్లో ఘనంగా నిర్వహించబడింది. భక్తుల జైజైధ్వానాలు, రామనామ స్మరణలు, మంగళవాయిద్యాల నినాదాలు, మహిళల కోలాటాలు, వేద మంత్రోచ్చారణల నడుమ సాగిన ఈ ఊరేగింపు ప్రాంతాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపింది. భారీగా తరలివచ్చిన భక్తజనాలు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దంపతులు, మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవం ద్వారా కూకట్ పల్లి ప్రాంతం భక్తి పారవశ్యంతో నిండిపోగా, నిర్వాహకులు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించినందుకు భక్తులు ప్రశంసలు వ్యక్తం చేశారు



## విద్యార్థులకు సన్మానం

మునుగోడు, ఏప్రిల్23(వెలుతురు):

10వ తరగతి సీబీఎస్ఈ పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించి ప్రతిభ కనబర్చిన సెయింట్ జోసఫ్ హై స్కూల్ విద్యార్థులను పాఠశాల ఆధ్వర్యంలో సన్మానించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థులను అభినందిస్తూ క్రమశిక్షణతో చదివితే విజయాలు సులభమని తెలిపారు.ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసి రావడంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇదే తపనతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ వేసవి సెలవుల్లో సమ్మర్ వొకేషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకునే అవకాశం పొందుతారని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎలిజబెత్ రాణి,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులకు సత్కారం



మునుగోడు, ఏప్రిల్ 23 (వెలుతురు ):

మండలంలోని ఇప్పర్తి గ్రామంలో గురువారం గురుకులం 5వ తరగతి ప్రవేశ పరీక్షలో సీట్లు సాధించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఘనంగా సత్కరించారు.గత సంవత్సరం,ఈ సంవత్సరం ప్రవేశ పరీక్షల్లో విజయాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శ్రీశ్రీశ్రీ సీతారామ లింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బూడిద లింగయ్య యాదవ్ శాలువాలు కప్పి,షీల్డ్‌లను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీమల రాజు యాదవ్,ఉపసర్పంచ్ మహేశ్వరి,మాజీ సర్పంచ్ బొజ్జ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ పులకరం సైదులు,గ్రామ కార్యదర్శి లింగస్వామి, ఆవుల శ్రీనివాస్ యాదవ్,పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షులు సయ్యద్ యూసఫ్ పాషా,ప్రధాన కార్యదర్శి మేకల అన్నపరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బి. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు జి. శ్రీనివాస్,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో భగీరథ జయంతి వేడుకలు



- **భగీరథుడు మహా జ్ఞాని పరోపకారానికి ఆయన పెట్టింది పేరు**
- **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.**

వికారాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:

వికారాబాద్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాజశ్రీ భగీరథ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భగీరథుడు ఎంత కష్టానైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించే వ్యక్తిత్వం కల మహా వ్యక్తి అని కలెక్టర్ కొనియాడారు. ఎవరైనా కటోర పరిశ్రమ చేసిన దేన్నైనా సాధిస్తే భగీరథ ప్రయత్నం చేశారని మనం చెప్పుకుంటామని కలెక్టర్ తెలిపారు.

జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డిపిఓ జయసుధ, డిడబ్ల్యూఓ కృష్ణవేణి, డిపిఆర్ఓ చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలి

- **ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

ఇబ్రహీంపట్నం వెలుతురు ఏప్రిల్ 23:



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆర్టీసీ కార్మికుల సమస్యలపై గళమెత్తారు.ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ముందు తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన ధర్నాకు మద్దతు తెలిపేందుకు వెళ్లే క్రమంలో పోలీస్ అధికారులు తనను అడ్డుకుని హౌస్ నిర్బంధం చేసినట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం పోలీసులు అన్యాయంగా తనను నిర్బంధించారని ఆరోపించారు.ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, కార్మికుల పక్షాన నిలబడే నాయకులను అణచివేయడం సరైంది కాదని ఆయన తీవ్రంగా స్పందించారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ, వారి న్యాయమైన డిమాండ్లు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.కార్మికుల జీవనోపాధి, ఉద్యోగ భద్రత, వేతనాలు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల వారు రోడ్డెక్కాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

“ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర రవాణా వ్యవస్థకు వెన్నెముకలాంటివారు.వారి కష్టాలు పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే, బీఆర్ఎస్ పార్టీ తరపున మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

కార్మికుల పట్ల సంఘీభావం తెలుపుతూ,వారికి పూర్తి మద్దతు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి, కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కర్నాటి రమేష్,చీరాల రమేష్,మాజీ ఉపసర్పంచ్ వనపర్తి బద్రీనాథ్ గుప్తా,జెర్కొని రాజు, కౌన్సిలర్లు చిలుకల బుగ్గరాములు, కొండిగారి త్రిలోక్ నాయకులు చీరాల రమేష్,నిట్టు జగదీశ్ మాజీ చైర్మన్ భరత్,నర్సింహా రెడ్డి,అచ్చన శ్రీశైలం,సోప్పరి కరుణాకర్,బి.గోపాల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 23:



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ తల్లిదండ్రులతో ప్రత్యేకంగా చర్చించారు. దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా ఇబ్బందిగా ఉందని, పాఠశాలకు స్కూల్ బస్సు కావాలని తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మెరుగుపరచాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే, దానికి అనుగుణంగా కొత్త బస్సును కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

పాఠశాలలోని కంప్యూటర్ మరియు సైన్స్ ల్యాబ్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్లతో మాట్లాడి ప్రయోగాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు పాఠశాలకు ఇంకేవైనా అవసరాలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచిగా ఉందా మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట సిబ్బందితో మాట్లాడి వారికి కావాల్సిన వంట సామాగ్రి లేదా ఇతర పరికరాల అవసరాల గురించి ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్ అనూష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. శంకరయ్య మరియు ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి సమ్మె విరమించాలి

- **న్యాయమైన డిమాండ్లు తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం ప్రదర్శించడం సరికాదు.**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:



రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గత రెండు రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికుల ఉద్యమం ఉధృతం కాకముందే వారిని చర్చలకు పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆర్టీసీ సమ్మె వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈరోజు వరంగల్ జిల్లా నర్సంపేట డిపోలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఒంటిమీద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించడం బాధాకరమని మానసిక ఆందోళనలు చెందకుండా సమస్య పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు ప్రయత్నించాలి గాని ఆత్మహత్యకు ప్రయత్నించడం సరికాదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు వెంటనే ఆర్టీసీ జేసీసీ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి వారి డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు

## చట్టసభలలో మహిళల ప్రాధాన్యత పెరగాలి

: బిక్షపతి యాదవ్



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 23:

భారత చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం వహించడానికి ప్రత్యేక రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ దశాబ్దాలుగా వినిపిస్తుంది. గత 75 ఏళ్ల గణతంత్రంలో చట్టసభల్లో మహిళలకు ప్రాతినిధ్యం దాదాపుగా 15% కంటే తక్కువగానే ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నారీశక్తి వందన్ అదినీయం ద్వారా చట్టసభలలో మహిళలకు 33% రిజర్వేషన్ లభించాలని దృఢ సంకల్పంతో లోకసభలో మహిళా బిల్లులను ప్రవేశ పెట్టడం జరిగిందని బిజెపి నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ పేర్కొన్నారు.ప్రస్తుతం ఉన్న లోకసభ 543 స్థానాల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే దాదాపు 181 స్థానాలు మహిళలకు దక్కుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రాజ్యాంగంలోని 131వ రాజ్యాంగ సవరణ చేయడం ద్వారా లోకసభ స్థానాలను 543 నుండి దాదాపు 850 కు పైగా పెంచాలని ప్రతిపాదనతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణకు పునుకుంటే కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు మహిళా ప్రాధాన్యత మాకు వద్దనే విధంగా దేశం మహిళలను కించపరుస్తూ బిల్లును వ్యతిరేకించడం ద్వారా దేశ మహిళల ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతమున్న పురుష ప్రతినిధుల సంఖ్యను తగ్గించకుండా అదనపు స్థానాలు కల్పించడం ద్వారా మహిళలను చట్టసభల్లో ప్రాతినిత్యం కల్పించారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని మోడీ మహిళా బిల్లును ఒక చట్టంగా మహిళా నేతృత్వంలోని అభివృద్ధికి బలమైన పునాదిగా ఉంటుందని లోకసభలో అభివర్ణించినప్పటికీ కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు అర్థసత్యాలను చూపిస్తూ బిజెపికి క్రెడిట్ ఎక్కడ వస్తుందని ఉద్దేశంతో బిల్లును వీగిపోయేటట్టు చేశారని, దేశంలోని మహిళ ప్రతినిధులు ముఖ్యంగా మహిళలు అందరూ అర్థం చేసుకున్నారని చట్టసభలలో బడుగు బలహీన వర్గాల మహిళలకు తగిన ప్రాధాన్యం లభించాలంటే బలమైన రాజకీయ ఉద్యమాలు తప్పనిసరి తెలిపారు. ఉద్యమాల్లో మహిళలు చురుకుగా పాల్గొని వారి హక్కులతో పాటు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించుకోవడానికి ప్రతి మహిళ ముందుకు రావాలని ఆశిస్తున్నామని అన్నారు.

## ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే పరిష్కరించాలి

- **బిఆర్ఎస్ పార్టీ మంచాల మండల అధ్యక్షులు చీరాల రమేష్**

మంచాల వెలుతురు ఏప్రిల్ 23:



మంచాల మండలం కేంద్రంలో విలేకరుల సమావేశంలో మంచాల మండలం బిఅర్ ఎస్ పార్టీ అ ధ్యక్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానంలో ఏ ఒక్కటి ఇప్పటివరకు నెరవేర్చలేదు అని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నేర్చుకపోవడంతోటే ఆర్టీసీ కార్మికులు సమ్మెచేస్తున్నారని వారు తెలిపారు బ డుగులైన కార్మికుల కోసం సమ్మెకు సంపూర్ణ మద్దతు బిఅర్ ఎస్ పార్టీ ఉంటుందని అన్నారు ప్రజ ల కోసం మెరుగైన రవాణా సేవలు అందించడంలో ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తారు అని కరోనా సమయంలో కూడా ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన కార్మికుల సమస్యలను కాం గ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగ్గదని అన్నారు తక్షణ పరిష్కార మార్గాలని చూపాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బి అర్ ఎస్ పార్టీ నాయకులు నూతన గంటి శేఖర్ చిందం రఘుపతి చిందం జంగయ్య నూకం కేశవ్ తదితరులు పాల్గొన్నారు

## బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) ఏప్రిల్ 23:



గురువారం పలు డివిజన్ల లో బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.291, 293, 294, 295 డివిజన్‌లోని,షాపూర్‌నగర్,సూరారం,గండిమైసమ్మ, బౌరంపేట డివిజన్లలో యువ నాయకులు కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి తమ బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాలు ఫౌండేషన్ సభ్యులు ఏర్పాటు చేశారు. వేసవి కాలం కావడంతో ప్రజలు త్రాగడానికి రోడ్డున వెళ్ళే ప్రజలకి దాహం తీర్చే విధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. సూరారం పోలీస్ స్టేషన్ సిఐ సుధీర్ కృష్ణ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బికేఆర్ ఫౌండేషన్ సభ్యులు, బెంబిడి హనుమంత్ రెడ్డి, దర్శన్ యాదవ్, నరసింహ రెడ్డి, మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బొబ్బల నరసింహ రెడ్డి, గజానంద్, మహేష్, కార్తీక్ రెడ్డి, బాబన్ నదీం, విక్రాంత్, అరుణ్ రెడ్డి, గంట శివారెడ్డి, రమేష్, జగదీష్, జగన్, తిరుపతి రెడ్డి, బొంగునూరి భరత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ బస్టాండ్ దగ్గర అందరు పాస్ నిర్మాణం మంజూరు కి సహకరించిన నితిన్ గడ్గరి, గంగిడి మనోహర్ రెడ్డి కి పాలాభిషేకం చేసి చేసిన బిజెపి నాయకులు

- **ప్రధాని నరేంద్ర మోడీ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కార్గే దిష్టిబొమ్మ దహనం చేసిన బిజెపి శ్రేణులు**

చౌటుప్పల్ వెలుతురు ఏప్రిల్ 23:





చౌటుప్పల్ నేషనల్ హైవే 65 ఫ్లై ఓవర్ నిర్మాణం లో భాగంగా చౌటుప్పల బస్ స్టేషన్ వద్ద అండర్ పాస్ నిర్మాణం కొరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గతంలో నిరసన కార్యక్రమాలు చేసి నేషనల్ హైవే అధికారులకు మరియు కేంద్ర మంత్రి నితిన్ గడ్గరి గారికి వినతి పత్రాలు అందజేయడంతో స్పందించిన అధికారులు బస్టాండ్ సమీపంలో అండర్ పాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వటంతో
గురువారం రోజున బీజేపీ ఆధ్వర్యంలో రహదారుల కేంద్ర మంత్రివర్యులు నితిన్ గడ్గరి గారికి మరియు ఈ అండర్ పాస్ మంజూరు కి సహకరించిన బిజెపి నాయకులు డాక్టర్: గంగిడి మనోహర్ రెడ్డి గారికి పాలాభిషేకం చేసి అధికారులు శివ శంకర్ మరియు సిఎస్ రావు గార్లకు భారతీయ జనతా పార్టీ నుంచి అభినందనలు తెలియజేయడం జరిగింది.
జాతీయ రహదారులు నిర్మాణం చాలా కాలం పడుతుంది. కాబట్టి దాన్లో తల దూర్చొద్దని చెప్పిన కాంగ్రెస్., బిఆర్ఎస్ మరియు వారి అనుబంధ పార్టీ నాయకులు నేడు మా వల్ల వచ్చిందని చెప్పుకోవడం సిగ్గుచేటుగా మేము అభివర్ణిస్తున్నాం అదేవిధంగా వలిగొండ నాగారం చౌటుప్పల్ రోడ్డు గత రెండు సంవత్సరాల నుండి పనులు నత్తనడక నడుస్తూ నేడు పూర్తిగా పని ఆపినారు స్థానిక ఎమ్మెల్యే గారు మంత్రివర్యులు ఆ రోడ్డుపై దృష్టి పెట్టి వెంటనే పూర్తి చేయాలని బిజెపి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకం నుండి నిరసన ర్యాలీజేస్తూ రోడ్డుపై బైఠాయించి నల్ల జెండా పాతి నిరసన వ్యక్తం చేయడమైనది ప్రజల కష్టాలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ఎమ్మెల్యే గారు వెంటనే ఈ రోడ్డు పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది.
కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కర్గే గారు గత కొంతకాలం నుండి నిరాశ నిస్పృహతో అనాలోచిత రెచ్చగొట్టే ధోరణితో మాట్లాడే విధానాన్ని బిజెపి ఖండిస్తూ
భారత ప్రధాని నరేంద్ర మోడీ గారిని ఉగ్రవాదిగా వర్ణించిన దానికి నిరసనగా కార్గే దిష్టిబొమ్మను చౌటుప్పల్ పట్టణంలో దహనం చేయనైనది దేశంలో శాంతిభద్రతలు క్షీణించే విధంగా ఒక వర్గం వారికి అనుకూలంగా మెజార్టీ ప్రజలను అవమాన పరుస్తూ మాట్లాడే కర్గే పై నాన్బేల బుల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసి జైల్లో పెట్టాలని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని అదేవిధంగా భారత జాతికి క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది

**ఈ కార్యక్రమాలలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**
దూడల బిక్షం గౌడ్. జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణ గోని శంకర్ జిల్లా ఉపాధ్యక్షులు శాగ చంద్రశేఖర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్ కంచర్ల గోవర్ధన్ రెడ్డి ఆలే చిరంజీవి రూరల్ అధ్యక్షులు కైరం కొండ అశోక్ దిండు భాస్కర్ 18 వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ గుజ్జుల సురేందర్ రెడ్డి. రెడ్డి బాయ్ సర్పంచ్ నందగిరి వెంకటేశం గౌడ్ ఊడుగు వెంకటేశం గౌడ్ పోలోజు శ్రీధర్ బాబు కంది లక్ష్మారెడ్డి ఉబ్బు బిక్షపతి కడారి ఐలయ్య పబ్బతి శేఖర్ గంట్ల బుచ్చిరెడ్డి. గుర్రం రవీందర్ తేలుకుంట్ల శ్రీధర్. రాధారపు సత్తయ్య పోలపల్లి ముత్తయ్య. గోషిక నీరజ హల్మాస్పేట గౌతమ్ గోషిక పురుషోత్తం కంచర్ల వెంకటరెడ్డి. కాసోజు గోపి. గుండెబోయిన వేణు వంగాల రమాకాంత్. కానుగు కొండల్. రాజపేట అశోక్. ఎల్లంకి పాండు. వరగంటి భాను. కానుగు శేఖర్ బత్తుల రాజశేఖర్. గుండెపల్లి వెంకటరెడ్డి. కాసోజు కనకాచారి. అంతటి నరేష్. పందుల శరత్. కొయ్యడ స్వామి. పోలోజు భాస్కరాచారి. గుండెబోయిన లింగస్వామి బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

పోచంపల్లి, ఏప్రిల్ 23(వెలుతురు న్యూస్ ):



భువనగిరి నియోజకవర్గం పోచంపల్లి మండలం లోని జలల్పూర్-పోచంపల్లి, రేవనపల్లి, శివారెడ్డి గూడెం,అలీ నగర్,జూలూరు గ్రామాల్లో PACS, ఐకేపీ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.
రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులకు ఆదేశించారు.
ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో 48 గంటలలోపే నేరుగా నగదు జమ అయ్యేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.
రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వానికి ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.
అలాగే గత ప్రభుత్వ పరిపాలనను ప్రస్తావిస్తూ, లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ లో లోపాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ, మాజీ మంత్రి కేటీఆర్, హరీష్ రావు వంటి నాయకులు ఇప్పటికీ అసత్య ప్రచారం చేయడం దురదృష్టకరమని అన్నారు. ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రాజెక్టుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన వారు అప్పట్లో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.
గత ప్రభుత్వ తప్పిదాల భారాన్ని ఇప్పుడు ప్రజలు మోస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఇప్పటికైనా వాస్తవాలను అంగీకరించి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
అనంతరం శివారెడ్డి గూడెం గ్రామంలో ఉప్పునూతల వెంకటేష్-మాధవి దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్త ఇంటిలో నివాసం ప్రారంభిస్తున్న కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేసి, వారి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాలు పేదల స్వప్నాలను సాకారం చేస్తున్నాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ శ్రీరేఖ-బాబురావు పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేష్, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, టౌన్ & గ్రామాల అధ్యక్షులు,కౌన్సిలర్లు,సర్పంచ్ లు,ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, PACS, ఐకేపీ, మెప్మా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 23:



మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాలేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పిసి గోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ కెసిఆర్ హరీష్ రావు పై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి వీలు లేదని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. అని తెలియజేస్తూ కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ ఎంపీపీ నీల దయాకర్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు పల్లివాడ ఎల్లంకి సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, ఇడం శ్రీనివాస్. మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం ఎండి ఆమీర్ జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, బద్దుల రమేష్, ఎస్కే చాంద్, యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న నాయకులు బొడ్డు అల్లయ్య, పిట్టె కృష్ణారెడ్డి, జెట్టి సైదులు, జాల అమరేందర్ రెడ్డి, బొలుగుల కృష్ణ, నల్ల సైదులు, బొడ్డుపల్లి రాజు, ఆవుల శ్రీధర్, కూనూరు లింగస్వామి, అంతటి మల్లేశం, ఎండి మోసబ్, శివరాత్రి కుమార్, గాదె లక్ష్మయ్య, ఆవుల సత్తయ్య, కడారి శివ, వరకల మల్లేశం, పావిరాల నరసింహ, కర్రె శీను, పండుగ వెంకన్న, మెడబోయిన నరేష్, పోషబోయిన నాగరాజు, కోసని అంజయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## జనసందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11 మంది వృద్ధులకు కంటి ఆపరేషన్



- **ఉచితకంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
- **జనసందేశ్ ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి**

మంచాల వెలుతురు ఏప్రిల్ 23:

మంచాల మండలం మంచాల గ్రామంలో జనసందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించిన వృద్ధులకు సదురం ఐ హాస్పిటల్ లో 11 వృద్ధులకు కం టి ఆపరేషన్లు చేశారు మంచాల గ్రామంనుండి 6 మందికి భూముల గ్రామం నుండి 5 మందికి కంటి ఆపరేషన్ చేశారు ఈ సందర్భంగా జనసందేశ్ ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినప్పుడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి ఉచిత క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వాల బాలరాజు డా క్టర్ల బృందం దివ్య జలజ మంజుల తదితరులుపాల్గొన్నారు

## కాచారం గ్రామంలో వైద్య శిబిరం

యాదగిరిగుట్ట ఏప్రిల్ 23 వెలుతురు



కాచారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రోగ్రాము లో భాగంగా టిబి ముక్త్ భారత్ అభియాన్ అనే ప్రోగ్రాం లో భాగంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ఇందులో టీబి వ్యాధికి సంబంధించిన పరీక్షలు రక్త పరీక్షలు, బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కమిషనర్ డాక్టర్ వీణ దావన్ , కాచారం గ్రామ ప్రజలకు టీ బి గురించి వివరించుచు టీబి 8 రకాల మనుషులకు తొందరగా వ్యాపిస్తుంది , వారు హెచ్ఐవి ఎయిడ్స్ కలిగి ఉన్నవారు షుగర్ ఉన్నవారికి అధిక రక్తపోటు ఉన్నవారికి మద్యం, పొగ తాగు వారికి పోషకాహారం లోపం ఉన్నవారికి, 60 సంవత్సరాల పైబడిన వారికి టీబీ వ్యాధి కలిగిన వ్యక్తులతో సంబంధం ఉన్నవారికి, బి.ఎం.ఐ 18.5 కన్న తక్కువగా ఉన్న వారిలో టీబీ వ్యాధి వ్యాపిస్తుంది అని కాచారం ప్రజలకు వివరించడం జరిగింది. టీబి వ్యాధి లక్షణాలు రెండు వారాలకు దగ్గు జ్వరము తెమ్మడలో రక్తపడడం చాతిలో నొప్పి రావడము, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండటము, బరువు తగ్గడం గ్రందులు వాపు మొదలగు లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాదిగిరి గుట్టకు వచ్చి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ మెడికల్ క్యాంపు లో కాచారం గ్రామ సర్పంచ్ కొండం ఉపేందర్ రెడ్డి , టీబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశామ్, డాక్టర్ మనోహర్, టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ మహేష్ శ్రీ ఘన, డాక్టర్. పావని మెడికల్ ఆఫీసర్ యాదగిరిగుట్ట గ్రామ ఉపసర్పంచి బర్మా మౌనిక గారు గ్రామ పాలకవర్గము, హెల్త్ ఆఫీసర్ సిహెచ్ వెంకటయ్య ఈశ్వర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ క్యాంపులో 152 మంది రోగులను పరీక్షించి, 142 ఛాతి ఎక్స్రే లను, రక్త పరిక్షలు 40 మందికి, తెమ్మడ పరీక్షలు నిర్వహించారు.

## కురుమలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం



- **వంగపల్లిలో కురుమ సంఘం భవనానికి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్**

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 23 వెలుతురు

కురుమ సామాజిక వర్గానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారి అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో కురుమ సంఘం నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగపల్లి గ్రామంలో కురుమ సామాజిక వర్గానికి అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా అన్ని సౌకర్యాలతో పెద్ద ఎత్తున కురుమ సంఘం భవనాన్ని నిర్మింప చేస్తున్నామని అన్నారు. ఇందుకోసం తగిన విధంగా నిధులు కేటాయిస్తామని అన్నారు. విశాలమైన భవనంలో కురుమ కులస్తులు వివిధ కార్యక్రమాలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఈ భవనాన్ని ఉపయోగించుకోవచ్చని అన్నారు. కురుమ కులస్తులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని , వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన భవన నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయనను వంగపల్లి గ్రామ కురుమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు కురుమ సంఘం సభ్యులు ఘనంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అంతకుముందు కురుమ సంఘం ఆధ్వర్యంలో సభ్యులు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను డప్పు, డోలు చప్పులతో బాణాసంచా కాలుస్తూ ఘనంగా స్వాగతం పలికి కురుమ సంఘం నూతన భవనానికి శంకుస్థాపన చేసే స్థలానికి ఘనంగా తోడ్కొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓగ్గు రవళి రాణా ప్రతాప్, రేగు బాల నర్సయ్య , కల్లేపల్లి శ్రీశైలం, కానుగు బాలరాజు, కురుమ సంఘం అధ్యక్షులు అచ్చిన మల్లయ్య , గోధుమ బీరయ్య, జోగు మహేష్ , జోగు చంద్రయ్య, గుజ్జ సిద్దులు, చిన్నం మల్లేష్, ఒగ్గు నవీన్, అచ్చిన కృష్ణస్వామి, ఎడపల్లి మహేష్, వినోద్, మైల శ్రీను, జోగు శంకర్, జోగు భాను తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్ గర్ధాసు విక్రమ్



రామన్నపేట వెలుతురు న్యూస్ ఏప్రిల్ 23:

పద్మావతి ఫంక్షన్ హల్ లో జరిగిన ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ బావమరిది తెడ్డు వినయ్ నిఖిత నిశ్చితార్థంలో పాల్గొని కాబోయేనూతన వధూవరులను ఆశీర్వధించిన బి ఆర్ ఎస్ నాయకులు చిన్నపాక పద్మావతి, శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, సీనియర్ నాయకులు మందడి విద్యా సాగర్ రెడ్డి మాజీ ఏఎంసి డైరెక్టర్, మండల నాయకులు రాస వెంకటేష్, మంటి లింగస్వామి, గర్ధాస్ వెంకటేష్ మాజీ ఉపసర్పంచ్, గర్ధాస్ వెంకటేశం పాలసంఘము డైరెక్టర్ చిన్నపాక సురేష్, గర్ధాస్ శ్రీకాంత్, తెడ్డు మధు, మంటి మహేష్, పంగ నరేష్, నాగు శివ తదితరులు పాల్గొన్నారు.

## దళారులని నమ్మి మోసపోవద్దు



- **రైతులకు మద్దతు ధర కలిపిస్తాం**
- **బోనగిరి వ్యవసాయ కమిటీ చైర్పర్సన్ శ్రీమతి శ్రీ రేఖ బాబు రావ్**

బొల్లేపల్లి ఏప్రిల్, 23(వెలుతురు న్యూస్ ):

బొల్లేపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఎరపాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాని ప్రారంభించిన ***మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖాబాబురావు**
ఈ కార్యకమంలో 8వ వార్డ్ మెంబర్ సందెల మహేష్ ,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుంట్ల కొండల్ ,గ్రామశాఖ అధ్యక్షులు ముక్కిడి బాలయ్య ,రెడ్డిసంఘం అధ్యక్షులు జిట్టా కృష్ణ రెడ్డి ,మాజీ ఉపసర్పంచ్ పినపురాల సమయ్య,కుర్మా సంఘం అధ్యక్షులు మాదా సత్యనారాయణ ,సరికొండ లక్ష్మయ్య,ఉదారి శంకరయ్య, గుండు కృష్ణ ,మద్ది బాల రెడ్డి ,కొత్తపల్లి శేఖర్ ,గండికోట యాదయ్య, గండికోట కృష్ణయ్య, కనుకుంట్ల వెంకటేష్ పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు



- **మేడ్చల్ జిల్లా కలెక్టర్ ను కలిసిన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు**

కూకట్ పల్లి ఏప్రిల్ 23 వెలుతురు:

మేడ్చల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ మనో చౌదరిని మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కలెక్టరేట్ లోని ఆయన చాంబర్లో కలిసి సత్కరించారు. జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లను మంజూరు చేయాలని కోరడం జరిగింది. ఇందుకు స్పందించిన ఆయన జీవో మేరకు తప్పనిసరిగా అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా జర్నలిస్టులను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో అక్రిడిషన్ కమిటీ సభ్యులు మోతే వెంకట్ రెడ్డి, గడ్డమీది బాలరాజు, రామారావు రవి, , సునీల్, ప్రసాద్, భూపాల్, రాజేష్ రెడ్డి, యూసుఫ్ దిన్, అబుద్ స్వామి, జిల్లా పౌర సంబంధాల అధికారిని స్వర్ణలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జెడ్‌పీహెచ్‌ఎస్ దిగ్వాల్ ఉపాధ్యాయుల కృషికి అభినందనలు

- సెన్సస్, స్పాట్ వాల్యూయేషన్ విధుల్లోనూ ఫలితాల సమర్పణ
- తల్లిదండ్రుల సమక్షంలో ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:**
సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ దిగ్వాల్ పాఠశాల ఉపాధ్యాయులు మరోసారి తమ అంకిత భావాన్ని చాటుకున్నారు. 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థుల పూర్తి ఫలితాలను ఏప్రిల్ 23న, విద్యా సంవత్సరంలోని చివరి పని దినాన, ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ జాకీర్ హుస్సేన్‌కు సమర్పించారు.
ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సెన్సస్ పనులు, స్పాట్ వాల్యూయేషన్ విధులు నిర్వహిస్తున్నప్పటికీ, తమ విద్యా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం విశేషంగా నిలిచింది. విద్యార్థుల అభ్యాస ప్రగతిని పారదర్శకంగా తెలియజేయాలనే ఉద్దేశంతో, తల్లిదండ్రుల సమక్షంలోనే ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులను విడుదల చేశారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయుల కృషిని స్థానికులు, తల్లిదండ్రులు ప్రశంసించారు. విద్యార్థుల శ్రద్ధ, తల్లిదండ్రుల సహకారం కూడా ఈ ఫలితాల్లో ముఖ్య పాత్ర పోషించాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ జాకీర్ హుస్సేన్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.







# కాళేశ్వరం తీర్పుతో ధర్మం గెలిచింది

- కేసీఆర్‌పై బురద చల్లే ప్రయత్నాలు విఫలం....
- జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు....

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:**
కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సంబంధించి తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుతో ధర్మం గెలిచిందని, ఇది తెలంగాణ ప్రజల విజయమని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పేర్కొన్నారు. మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు తదితరులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పి.సి.ఘోష్ కమిషన్ అసలు కమిషన్ కాదని, పి.సి.సి కమిషన్‌లా పనిచేసిందని వారు ఎద్దేవా చేశారు.  కాళేశ్వరం తీర్పుతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్), అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు నైతిక విజయం సాధించారని తెలిపారు. ఈ తీర్పుతో బీఆర్ఎస్ శ్రేణుల్లో పండగ వాతావరణం నెలకొన్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కేసీఆర్‌పై బురద చల్లాలని ప్రయత్నించినా, న్యాయస్థానం తీర్పుతో అది సాధ్యం కాదని తేలిపోయిందని ఎమ్మెల్యే విమర్శించారు. చట్టవిరుద్ధ పద్ధతుల్లో కమిషన్లు వేసి ఇబ్బందులు పెట్టాలనుకుంటే న్యాయవ్యవస్థ చూస్తూ ఊరుకోదని ఈ తీర్పు స్పష్టం చేసిందన్నారు.
కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి కోసం రేయింబవళ్లు శ్రమించి కాళేశ్వరం వంటి అద్భుత ప్రాజెక్టును నిర్మించారని, ఆయన చిత్తశుద్ధిని ప్రశ్నించడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. "సత్యం ఎప్పుడూ నిలకడగా ఉంటుంది. కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉంది. రాజకీయంగా ఎదుర్కోలేక, ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్న మా నాయకులను ఘోష్ కమిషన్ పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇలాంటి కుట్రలను ప్రజలే తిప్పికొడతారు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల గొంతు ఎండిపోకుండా భగీరథ ప్రయత్నం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడుతూ, హైకోర్టు తీర్పుతో నిజం నిగ్గుతేలిందని పేర్కొన్నారు. ఇకపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే మాణిక్ రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మున్సిపల్ కౌన్సిలర్లు గౌస్ గౌరీ, దీపక్, విశ్వేశ్వర్, ప్రవీణ్, సర్పంచ్‌లు మచ్చేందర్, మోహన్ రాథోడ్, రాథోడ్ భీమ్ రావు నాయక్, బాల్ రాజ్, దేశెట్టి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



# వాసవి మాత జయంతిని ప్రభుత్వ పండగల నిర్వహించడం అభినందనీయం - ఎమ్మెల్యే సంజీవ రెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ ఏప్రిల్ 23 :**
నారాయణఖేడ్ నియోజకవర్గం లో ఆర్యవైశ్య కుల దైవమైన వాసవి మాత జయంతిని ప్రభుత్వ పండగల అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాసవి మాత త్యాగశీలి అని, ఆమె యొక్క త్యాగాన్ని భావి తరాల వారికి తెలియజెప్పడం కోసం గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి జయంతిని ప్రభుత్వ పండగల నిర్వహించే విధంగా జీవో విడుదల చేయడం గొప్ప విషయం అన్నారు. అందుకు కృషి చేసిన ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాతను కూడా ఆయన అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైశ్యులకు సుముచిత స్థానం ఉంటుం దన్నారు.

**వాసవిమాత జయంతిని అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం- ఆర్యవైశ్య సంఘం నాయకులు**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వాసవిమాత జయంతిని ప్రభుత్వ పండుగల నిర్వహించే విధంగా జీవో విడుదల చేయడం గొప్ప విషయమని, ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాత చేసిన కృషిని సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు మునిగాల మాణిక్ ప్రభుగుప్త, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోటగిరి సతీష్, ఖేడ్ పట్టణ అధ్యక్షులు దారం క్రిష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి వీరేశలింగం, కోశాధికారి నగేష్, వాసవిక్లబ్ అధ్యక్షులు సాయిబాబా, అవోపా అధ్యక్షులు కోటగిరి సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఆత్మకూరి రాజు, వాసవిక్లబ్ మాజీ డిప్యూటీ గవర్నర్ భూషణం, సాయి. తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.




# కలెక్టరేట్‌లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు

- భగీరథుని కృషి స్ఫూర్తిదాయకం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) ఏప్రిల్ 23:**
జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం మహర్షి భగీరథ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహర్షి భగీరథుడు తన పట్టుదల, అకుంఠిత దీక్షతో గంగానదిని భువికి తెచ్చి లోక కల్యాణం చేశారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఆయన కృషి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. భగీరథుని వలె మనమందరం సమాజ హితం కోసం నిస్వార్థంగా పనిచేయాలి. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది భగీరథుని ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. జల సంరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ విషయాల్లో భగీరథుని స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సగర పుత్రులకు ముక్తిని కలిగించడం కోసం తరతరాలుగా చేసిన తపస్సును కొనసాగించి విజయం సాధించిన భగీరథుని సంకల్పం అందరికీ ఆదర్శమని అన్నారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, మధు మోహన్ . జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి చక్రధర్ , పవన్, సునీత, అశ్వక్, జీవన్,శాంతయ్య తదితరులు, జిల్లా అధికారులు మరియు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.



# మొబైల్ దూరం – ఆటపాటలే పిల్లల బలం



- పిల్లల భవిష్యత్తుకు అంగన్‌వాడీ సేవలు కీలకం
- 36వ వార్డు కౌన్సిలర్ శ్రావణ్ కుమార్

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23**: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, చిన్నారులు ప్రదర్శించిన ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయని అన్నారు. ప్రస్తుత కాలంలో చిన్నారులు ఎక్కువగా సెల్‌ఫోన్‌లు, టీవీలకు అలవాటు పడుతున్నారని, ఇది వారి శారీరక, మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అందుకే తల్లిదండ్రులు పిల్లలను స్క్రీన్‌ల నుండి దూరంగా ఉంచి, ఆటపాటలు, సృజనాత్మక కార్యక్రమాల వైపు దారితీయాలని సూచించారు. కుటుంబ సభ్యులు పిల్లలతో కలిసి గడిపే సమయం పెంచాలని, ఫ్యామిలీ ప్లే టైమ్‌ను ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుశీల 'నో స్క్రీన్ అవర్' మరియు 'ఫ్యామిలీ ప్లే టైమ్' ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు వివరంగా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రాథమిక విద్యా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. ఈ సేవలు పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు.  అనంతరం సూపర్వైజర్ బి. సునీత మాట్లాడుతూ "పోషణ దేశానికి వెలుగు" అనే నినాదాన్ని సాకారం చేయడంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సరైన పోషణతో ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్, ఐడీఎస్ఎంటీ కాలనీ, సంతోషినగర్, వడ్డెరగూడ ప్రాంతాల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.

# మట్టి పరీక్షలు – సమతుల్య ఎరువుల యాజమాన్యంపై అవగాహన సదస్సు విజయవంతం

- రైకోడ్, న్యాల్కల్ మండలాల రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై మార్గనిర్దేశం
- భూసార పరీక్షల ప్రాముఖ్యతపై నిపుణుల విశదీకరణ

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:**
సంగారెడ్డి జిల్లా రైకోడ్ మండలంలోని మహబూతుపూర్, ఇటికెపల్లి గ్రామాలు మరియు న్యాల్కల్ మండలంలోని తాటిపల్లి గ్రామాల రైతులకు డి.డి.ఎస్-కేవీకే ఆధ్వర్యంలో మట్టి పరీక్షలు మరియు సమతుల్య ఎరువుల యాజమాన్యంపై అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని శాస్త్రీయ సాగు పద్ధతులపై ఆసక్తిగా అవగాహన పొందారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష నిపుణులు ఈ. స్వామి మాట్లాడుతూ, శాస్త్రీయ పోషక నిర్వహణలో మట్టి పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. మట్టి విశ్లేషణ ద్వారా భూమి సారవంతత స్థాయిని ఖచ్చితంగా అంచనా వేసి, పంటల అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఎరువుల వినియోగాన్ని అమలు చేయవచ్చని తెలిపారు. మట్టి పరీక్షలు చేయించడం ద్వారా అనవసర ఎరువుల ఖర్చును తగ్గించుకోవడంతో పాటు దిగుబడులను పెంచుకోవచ్చని రైతులకు సూచించారు.
అలాగే, మట్టి నమూనాల సేకరణలో పాటించాల్సిన ప్రమాణ పద్ధతులను ప్రదర్శిస్తూ రైతులకు ప్రాక్టికల్‌గా చూపించారు. పొలాల సరైన ఎంపిక, 6 నుంచి 9 అంగుళాల లోతులో నమూనా సేకరణ, మట్టి శుద్ధి, సరైన లేబులింగ్, భూసార పరీక్ష కేంద్రాలకు నమూనాలను పంపించే విధానం వంటి అంశాలను వివరంగా వివరించారు.
అగ్రానమీ శాస్త్రవేత్త వి. రమేష్ మాట్లాడుతూ, సమగ్ర పోషక నిర్వహణ (INM) ముఖ్య సూత్రాలను వివరించారు. వర్మికంపోస్ట్, మేక ఎరువు వంటి సేంద్రీయ ఎరువుల వినియోగం, జీవ ఎరువులు, గ్రీన్ మాన్యూర్ వినియోగం, పంట అవశేషాలను భూమిలో కలపడం, పంటల మార్పిడి (Crop Rotation), అంతర పంటల విధానాలను అనుసరించడం ద్వారా భూమి సారవంతతను దీర్ఘకాలికంగా పెంచుకోవచ్చని సూచించారు. అధిక మోతాదులో నత్రజని, కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.  ఈ సదస్సులో గ్రామ సర్పంచులు రిభికా నాగేష్, ఎల్లొయ్ లక్ష్మాన్, తంబలి రాజు పాల్గొని రైతులను శాస్త్రీయ సాగు పద్ధతులు అనుసరించాలని సూచించారు. డి.డి.ఎస్ సూపర్వైజర్లు బాలయ్య, వినయ్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు తమ సందేహాలను నిపుణులతో చర్చించుకుని, మట్టి పరీక్షలు చేయించుకునేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.




# జహీరాబాద్ ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల సమ్మెకు ఎమ్మెల్యే మాణిక్ రావు మద్దతు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు...
- కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్...
- బిఆర్ఎస్ తరపున భారీ ఉద్యమాలకు సిద్ధమని హెచ్చరిక...

**జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23**: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ఆర్టీసీ డిపో వద్ద తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న కార్మికులకు ఎమ్మెల్యే మాణిక్ రావు సంఘీభావం తెలిపారు. సమ్మె స్థలాన్ని సందర్శించిన ఆయన కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రెండున్నర సంవత్సరాలుగా ఓపిక పట్టిన కార్మికులు చివరకు దిక్కుతోచని పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. కార్మికుల సహనాన్ని ప్రభుత్వం బలహీనతగా భావిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలోని కొంతమంది నేతలు, ముఖ్యంగా పొన్నం ప్రభాకర్, బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తూ కార్మికుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారని, అందులో ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం తక్షణమే చేయాల్సిన పని అని అన్నారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఈ ప్రక్రియ వేగంగా జరుగుతోందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం అమలుతో డ్రైవర్లు, కండక్టర్లపై పనిభారం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. కొత్త నియామకాలు చేపట్టకపోవడం వల్ల పాత డ్రైవర్లపై తీవ్రమైన ఒత్తిడి పడుతోందని చెప్పారు. ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా వారి జీవితాలతో ఆటలాడుకుంటోందని తీవ్రంగా విమర్శించారు. గతంలో ఆర్టీసీకి ఇచ్చిన రూ.200 కోట్ల చెక్కుకు ఇప్పటివరకు స్పష్టత లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన చెక్కు కూడా చెల్లలేదని ఆరోపించారు.



# ప్రధాని మోడీపై ఖర్గే వ్యాఖ్యలు దుర్మార్గం- పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్

**విజయవాడ వెలుతురు ఏప్రిల్ 23:**
కాంగ్రెస్ పార్టీ నేతలు ఇంతకన్నా దిగజారి పోలేరు అనుకుంటున్నా ప్రతిసారి అంతకుమించి దిగజారి పోతున్నారు. ఒక దశాబ్దకరంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిని బిజెపి నేతలని నిఘంటువులు ఉన్న తిట్లు కన్నా కొత్తవి కనిపెట్టి మరి తిడుతున్నారు. ఆరు దశాబ్దాల పైచిలుకు దేశాన్ని ఏకచక్రాధిపత్యంగా పరిపాలించిన పార్టీ నేతల ఎందుకు చౌకబారు భాష మాట్లాడుతున్నారు..??
కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారు తమిళనాడులో ఒక పాత్రికేయుడికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అన్నాదురై సిద్ధాంతాలతో నడిచే ఏఐడీఎంకే పార్టీ బిజెపితో ఏరకంగా పొత్తు పెట్టుకుంటుంది... ప్రధాని మోడీ గారు అప్ప ప్రజాస్వామిక వాది ఆయన ఒక "ఉగ్రవాది" అని సిగ్గుమాలిన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ గారు గత పాతిక సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధిగా ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా నిర్విరామంగా దేశ ప్రజలకి సేవ చేస్తూ అంకిత భావానికి నిస్వార్థ సేవకి ప్రతిరూపంగా ప్రేరణగా నిలుస్తున్నారు. అందుకే వారికి 30 పైగా దేశాలు వారి అత్యుత్తమ పౌర పురస్కారాన్ని ప్రధాని మోడీ గారికి అందించారు. గడచిన ఏడు సంవత్సరాలుగా ప్రపంచంలో అత్యధిక ఆదరణ ఉన్న నేతగా ప్రధాని మోడీ అనేక అంతర్జాతీయ సర్వేలలో కొనసాగుతున్నారు. అటువంటి వ్యక్తిని ఉగ్రవాది అనటానికి ఆయనకి నోరెలా వచ్చింది. అవునులే గడిచిన దశాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీ భావి ప్రధానిని అని చెప్పుకుంటున్న రాహుల్ గాంధీ పాకిస్తాన్ కరుడుగట్టిన తీవ్రవాది భారతదేశంలో అనేక అల్లర్లు బాంబ్ బ్లాస్ట్ లు చేస్తున్న మసూద్ అజర్ అనే దుర్మార్గున్ని ఒక సభలు ప్రస్తావిస్తూ "మసూద్ అజర్ గారు" అన్నారు, వాళ్ల పార్టీ నేత దిగ్ విజయ్ సింగ్ "ఒసామా బిన్ లాడెన్ గారు" అన్నారు, మరో నేత ఆఫీస్ సయ్యద్ గారు అన్నారు. దీన్నిబట్టి మనకి అర్థమవుతుంది ఏంటంటే కాంగ్రెస్ పార్టీ నేతలకి ఉగ్రవాదులు మహనీయులుగాను మహనీయులు ఉగ్రవాదులుగాను కనపడుతున్నారు. మోడీ గారిని ద్వేషిస్తూ ద్వేషిస్తూ వీళ్ళు ఏ స్థాయికి వెళ్లారంటే మన దేశంపై జిహాద్ చేస్తున్న వాళ్లు మహనీయులుగా కనపడుతున్నారంటే వీళ్ళని ఏం చేయాలి... ఇటువంటి దేశద్రోహుల్ని ఏమనాలి..??
పేద అన్నగారిన కులాల నుంచి వచ్చిన ప్రధాని మోడీ గారిని 2014 నుండి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ నేతలు అనేక రకాలుగా అవమానిస్తూ తిడుతూ ఉంటున్నారు. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ గారు మోడీ ఒక ఛాయ్ వాలా అని




అతను ప్రధాని ఎలా అవుతారని ప్రశ్నిస్తే, సోనియా గాంధీ గారు ప్రధానిని నరహంతకుడిగా అభివర్ణించారు, ఇటీవల బీహార్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఉన్న సభలో ప్రధాని మోడీ తల్లిని బూతులు తిడితే ఆయన ప్రోత్సహించారు, ప్రధాని మోడీ నీచ కులం నుంచి వచ్చారని తిట్టారు, ఆయన ఒక వైరస్ అన్నారు, ఇటీవల అస్సాం ఎన్నికల్లో ఖర్గే గారు మాట్లాడుతూ బిజెపి ఆర్ఎస్ఎస్ నేతలు విషపూరిత సర్పాలని మీరు నమాజు చేసుకుంటున్నా సరే అది ఆపి కర్రతో వాళ్ళని కొట్టి చంపాలని పిలుపునిచ్చారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల నుంచి కింద వరకు ఒక అహంకారపూరిత ధోరణితో ఈ దేశాన్ని కాంగ్రెస్ కుటుంబబీకులే పరిపాలించాలి వేరొకరు ప్రధాని స్థానంలో ఉండకూడదన్న అహం బావ ధోరణితో కొట్టుమిట్టాడుతున్నారు. రాహుల్ గాంధీ గారు ఇటీవల ముగిసిన పార్లమెంట్ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ఒక గారడీ అని బాలాకోట్ సర్జికల్ దాడులు ఒక గారడీ అని అన్నారు. ఇప్పుడు మల్లికార్జున ఖర్గే గారు ప్రధాని గారిని ఉగ్రవాది అంటున్నారు. ఈ రెంటినీ మనం ఒకసారి పరిశీలించి విశ్లేషిస్తే మనకి ఒక అంశం అర్థం అవుతుంది. జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో పాకిస్తాన్ ఉగ్రవాదులు హిందువులపై చేసిన నరమేధం ఒక గారడీ అని, దాన్ని సాకుగా చూపించి ఆపరేషన్ సింధూర్ చేశారని అది కూడా ఒక గాడి అని రాహుల్ గాంధీ గారి ఉద్దేశం. అంటే ఈయన ఉద్దేశం ఉగ్రవాది దాడి జరగలేదు పాకిస్తాన్ పై అనవసరమైన దాడులు చేశారు, పాకిస్తానీ అనవసరంగా దోషిగా చూపిస్తున్నారని ఆయన ఉద్దేశం. దాని కొనసాగింపుగా ఖర్గే గారు ప్రధాని మోడీ ఏ ఉగ్రవాది పాకిస్తాన్ ఉగ్రవాదులు మంచోళ్ళు అని చెబుతున్నారు. ఇలా వీళ్లు ఎందుకు మాట్లాడుతున్నారు దీని వెనక రాజకీయ ఉద్దేశం దురుద్దేశం ఏంటి..?? రాహుల్ గాంధీ వాళ్ళ నేతల ఉద్దేశం ఏంటంటే పాకిస్తాన్ ని వెనకేసుకుని రావటం ద్వారా దేశంలోని ముస్లింలు సంతోషిస్తారని తద్వారా వాళ్ల ఓట్లు కాంగ్రెస్ పార్టీకి గుప్తంగా పడిపోతాయని వాళ్ల ఉద్దేశం గా కనబడుతోంది. అంటే కాంగ్రెస్ పార్టీ నేతల ఉద్దేశంలో ఈ దేశ ముస్లింలు భారతదేశంలో ఉగ్రవాద దాడులు చేస్తున్న పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు వ్యక్తులకు మద్దతుగా ఉంటారని... వారికి దేశం కన్నా మతమే ముఖ్యమని... అంటే వాళ్లు దేశ ద్రోహులని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయంగా కనబడుతోంది. ఈ దేశంలో నివసిస్తున్న ముస్లింలు దేశభక్తులు అన్న విషయం కాంగ్రెస్ పార్టీకి అర్థం కాకపోవడం బాధాకరం. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గారు వారి పార్టీ నేతలు ప్రధాని మోడీ గారిపై చేస్తున్న జుగుప్సాకరమైన వ్యాఖ్యలు బహుశా రాహుల్ గాంధీ గారిని సంతృప్తి పరచవచ్చు, వారికి మరిన్ని పదవులు ఇవ్వచ్చు కానీ దేశ ప్రజలు మిమ్మల్ని క్షమించరు... సమయం వచ్చినప్పుడల్లా వారి పవిత్ర ఓటు ద్వారా మీ చెంపలు వాయిస్తూ ఉన్నారు భవిష్యత్తులో కూడా మీకు వాయింపుడు తప్పదు... తస్మాత్ జాగ్రత్త...!!

# చార్మినార్ చెంత ఆదివాసీల సందడి

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 23:**
చారిత్రక చార్మినార్ ప్రాంగణం ఆదివాసీల రాకతో కోలాహలంగా మారింది. గురువారం ఉదయం ఆదివాసీ బృందం భాగ్యనగరానికి చిహ్నమైన ఈ కట్టడాన్ని సందర్శించింది. వారికి పర్యాటక శాఖ అధికారులు మంగళ వాయిద్యాల నడుమ సాదరంగా ఆహ్వానం పలికారు. సన్నాయి మేళాలు, డోలు దరువులతో మార్మోగుతున్న పరిసరాల మధ్య వారికి తిలకం దిద్ది, సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు.
మొదటిసారిగా చార్మినార్‌ను సందర్శించిన ఆదివాసీలు దాని నిర్మాణ శైలిని చూసి అబ్బురపడ్డారు. ప్రాచీన కాలం నాటి శిల్పకళా వైభవం తమను ఎంతగానో ఆకట్టుకుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. విదేశీ పర్యాటకులతో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఆ అనుభూతిని జ్ఞాపకాలుగా నిలుపుకున్నారు.
నగరానికి వస్తే చార్మినార్ చూడాలని ఎప్పటి నుంచో



అనుకుంటున్నాం. ఇక్కడి స్వాగతం, ఆ మర్యాదలు మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయి అని ఆదివాసీలు హర్షం వ్యక్తం చేశారు. చార్మినార్ విశిష్టతను, దాని వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని పర్యాటక శాఖ అధికారులు వారికి వివరంగా వివరించారు. కొందరు ఆ అద్భుత దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు. నగర పర్యటనలో భాగంగా తమకు లభించిన ఈ గౌరవం, ఆత్మీయత మర్చిపోలేమని ఆదివాసీ బృందం సంబురపడింది.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం




- **తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**
- **హైదరాబాద్ లో ప్రారంభమైన ఎన్ యుజెఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు**
- **26 రాష్ట్రాల నుంచి హాజరైన మీడియా ప్రతినిధులు.**

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 23:**
నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ కార్యవర్గ సమావేశాలను తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్ జేయు) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం నగరంలోని చిక్కడపల్లిలో హోటల్ శ్రీ వేద ప్రీమియంలో జరిగిన ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, టిపిపిసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో మీడియా ఫోర్త్ పిలర్ గా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా జర్నలిస్టులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యలపై చర్చించేందుకు ఇలాంటి జాతీయ స్థాయి సమావేశం నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మీడియా ప్రతినిధులు జర్నలిస్టుల సమస్యలపై రెండు రోజులపాటు విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి తనను ఆహ్వానించినందుకు నిర్వాహకులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలో తెలంగాణ ప్రభుత్వం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే భవిష్యత్తులో జర్నలిస్టులకు మరిన్ని సంక్షేమ సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టులు సమాజాన్ని చైతన్య పరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని మంత్రి వివేక్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలు హనుమాన్ల ఝాన్సీ రెడ్డి, ఎన్ యుజె(ఐ) జాతీయ అధ్యక్షులు సురేష్ శర్మ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియగ్ నారాయణ, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం నారగౌని, తోకల అనిల్ కుమార్, స్కూల్ ఆఫ్ జర్నలిజం చైర్మన్ నాగేశ్వరరావు, ఎన్ యుజె(ఐ) కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాజు పటేల్, అరుణ్ కుమార్, స్టేట్ ఆర్గనైజేజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, స్టేట్ సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, ప్రధానకార్యదర్శి దొమ్మటి రవీందర్, గట్టు రవీందర్, కందికొండ మోహన్, చిర్రగోని ఉదయ్ దీర్, ఉప్పలంచి నరేందర్, పోచంపల్లి రజిత, నాగరాజు, శ్రీనాథ్, అవునూరి సంపత్, గట్టు మహేష్ గౌడ్, సోషల్ మీడియా ఇంచార్జి జోడు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.




# కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తంపై సిబిఐ దర్యాప్తు కు సీఎం రేవంత్ లేఖ రాయాలి

- **సెన్సస్, స్పాట్ వాల్యూయేషన్ విధుల్లోనూ ఫలితాల సమర్పణ**
- **మూడు బ్యారేజ్ ల పై మాత్రమే విచారణకు అసెంబ్లీలో తీర్మానం చేశారు**
- **మొ త్తం ప్రాజెక్టు పై విచారణ జరపాలన్నది మా డిమాండ్**
- **అధికారంలోకొస్తే కాళేశ్వరం లో అవినీతి డబ్బుని కక్కిస్తానని రాహుల్, రేవంత్ వాగ్దానం**
- **వచ్చాక, రాష్ట్ర ప్రభుత్వం తో విచారణ చేత కాదని, కేంద్రానికి లేఖలు రాస్తున్నారు**
- **కాంగ్రెస్, బిఆర్ఎస్ తో కుమ్ముక్కై డూప్ ఫైటింగ్ చేస్తున్నారు.**
- **పిసి ఘోష్ కమిషన్ పేరుతో రెండేళ్ల పాటు కాలయాపన చేశారు**
- **కాళేశ్వరం కట్టిన కంపెనీకే రేవంత్ రెడ్డి మళ్లీ మూసి రివర్ డెవలప్ ప్రాజెక్టు ఇచ్చారు.**
- **రేవంత్ రెడ్డి, కేసీఆర్ వేర్వేరు కాదు**
- **రెండున్నరేళ్లలో కేసిఆర్ కుటుంబ సభ్యులపై రేవంత్ ఏ ఒక్క చర్య తీసుకోలేదు**
- **పేరు మార్చుకుంటా...అని రేవంత్ ఉత్తర ప్రగల్భాలు పలికే కంటే...చేతల్లో చూపించాలి**

**బిజెపి ఎంపీ రఘునందన్ రావు**

**డిల్లీ వెలుతురు ఏప్రిల్ 23:**
కాళేశ్వరం ప్రాజెక్ట్ DPR నుంచి మొదలు రేవంత్ రెడ్డి సీఎం గా ప్రమాణం చేసిన వరకు సీబీఐ చేత విచారణ



జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం రేవంత్ వెంటనే కేంద్ర హోమ్ మంత్రి కి ఉత్తరం రాయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడుగా ఉన్న రేవంత్ అది కూలేశ్వరం అని మాట్లాడి.. కేసీఆర్ అవినీతి సొమ్మును కక్కిస్తాం అని తెలంగాణ ప్రజలు తనను నమ్మరేమో అని వాళ్ల నాయకుడు రాహుల్ గాంధీ చేత కేసీఆర్ కుటుంబం చేసిన లక్ష కోట్ల అవినీతిని కక్కిస్తాం అని రెండున్నర సంవత్సరాలుగా కాలయాపన చేశారని దీని వెనక రెండు పార్టీల ఒప్పందం స్పష్టంగా కనపడుతోందని ఆరోపణ చేశారు. ఇంత పెద్ద అవినీతి తన పరిధిలోకి రాదని తెలిసి కూడా కేవలం కాలయాపన కోసమే ఇదంతా చేసి కాంగ్రెస్ హైకమాండ్.. కేసీఆర్ మధ్యన జరిగిన ఒప్పందం మేరకే ఘోష్ కమిషన్ వేశారని అన్నారు. ఒక సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పని చేసిన ఘోష్ కి ఎవరికి నోటీసులు ఇవ్వాలి ఎవరిని విచారించాలో తెల్వదా అని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు పై కాంగ్రెస్ , బిఆర్ఎస్ డ్రామాలు వేసి బాహుబలి లాగా డూప్ ఫైటింగ్ చేస్తున్నాయని అన్నారు.
కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టు లో లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కంపెనీ కీ రేవంత్ రెడ్డి మానస పుత్రిక అయిన మూసి ప్రాజెక్టు కాంట్రాక్టు కూడా ఇస్తున్నారని, అందుకోసమే ఆ కంపెనీకి కాంట్రాక్టు లభించడం కోసమే నిబంధనలు కూడా మార్చినట్టు వార్తలు వస్తున్నాయని రఘునందన్ రావు ఆరోపించారు. త్వరలోనే అదే కంపెనీకి మూసి ప్రాజెక్టులో మొదటి దశ కింద 9500 కోట్ల రూపాయలు టెండర్ ఇస్తున్నట్టు కూడా తెలుస్తుందని అన్నారు.
కేసీఆర్ సర్కారు లో రేవంత్ జైలు లో పెడితే మరి అవినీతి చేశారని చెప్తున్నా కేసీఆర్ ను ఆయన కుటుంబ సభ్యులను జైలుకు పంపడానికి రేవంత్ పౌరుషం ఏమైందని రఘునందన్ ప్రశ్నించారు.
ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన రేవంత్ .. స్వయంగా కేసీఆర్ బిడ్డ ..మా నాయన అధికారం లో ఉన్నప్పుడు ఆయన చుట్టూ ఉన్న వారు లక్షల కోట్ల అవినీతి చేశారని చెప్తున్నా కూడా కవితని అప్రూవర్ గా ఎందుకు మార్చడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అందుకే కాంగ్రెస్ బిఆర్ఎస్ ల బంధం వీణా వాణి ల బంధం అని ఒక నాణేనికి కాంగ్రెస్ , బిఆర్ఎస్ బొమ్మా బొరుసలని ఇది 2004 ఎన్నికల్లో డీ ఎస్ కుదిర్చింది అన్నారు. రేవంత్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కేంద్ర హోమ్ మంత్రి కి కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం మీద సీబీఐ విచారణ జరిపించే విధంగా మూడు లైన్ల లేఖ రాయాలని ఆయన డిమాండ్ చేశారు.
జగిత్యాల జైత్రయాత్ర అన్న నక్సలైట్లు పీపుల్స్ వార్ గా తర్వాత మావోలుగా మారి ఇప్పుడు మావో రహిత భారత్ గా మారినట్టు.. జగిత్యాల జైత్రయాత్ర మీటింగ్ పెట్టిన కేసీఆర్ పార్టీ కూడా తెరాస నుండి బారాస గా మారి కనుమరుగు కావడం ఖాయం అన్నారు.

# రవీంద్రభారతిలో సగర భగీరథ మహర్షి జయంతి - సగర సంఘానికి మంత్రుల హామీలు

- **సగర సంఘానికి మంత్రుల హామీలు**
- **వైభవంగా జరిగిన వేడుకలకు ప్రముఖ నేతల హాజరు**
- **భగీరథుని ఆదర్శంగా తీసుకోవాలని మంత్రుల పిలుపు**
- **సగరుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం హామీ**
- **42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ భగీరథ ప్రయత్నం**
- **ఉన్నత విద్యపై దృష్టి సారించాలని యువతకు సూచన**
- **సగర ప్రతినిధులకు ప్రభుత్వ అండ కొనసాగుతుందని స్పష్టం**

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:**
హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయాదేవి, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు. మంత్రులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. సగరుల సమస్యల పరిష్కారానికి ముందుండి కృషి చేస్తామని స్పష్టం చేశారు. భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకొని అసాధ్యాన్ని సుసాధ్యం చేయాలన్న సందేశాన్ని యువత ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. భగీరథ ప్రయత్నం అనే భావన నేటి సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు.



ఇక మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సగర సంఘం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యలను కేవలం డిమాండ్లకే పరిమితం కాకుండా కార్యరూపం దిద్దాలని సూచించారు. బలహీన వర్గాల అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం భగీరథ ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. కుల గణన ద్వారా అన్ని వర్గాల జనాభా, ఆర్థిక స్థితిగతుల వివరాలను సేకరించి వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆయన వివరించారు. ఉన్నత విద్యే అభివృద్ధికి మార్గమని, యువత విద్యపై దృష్టి సారించాలని సూచించారు. సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్‌లుగా ఉన్న సగర సంఘ ప్రతినిధులకు ప్రభుత్వ అండ ఎప్పుడూ ఉంటుందని మంత్రులు స్పష్టం చేశారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇందిరా పార్క్ వద్ద మే 5న ఒక్కరోజు నిరాహార దీక్ష

టీజీఈజేఏసీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ విక్రమ్ కుమార్, కన్వీనర్ కృష్ణ.

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:
తెలంగాణ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న జాప్యాన్ని నిరసిస్తూ, రెండో విడత ఉద్యమంలో భాగంగా మే 5వ తేదీన ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 'ఒక రోజు నిరాహార దీక్ష' చేపట్టనున్నట్లు టీజీఈజేఏసీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ విక్రమ్ కుమార్ మరియు కన్వీనర్ కృష్ణ యాదవ్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం వారు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్‌ను కలిసి నిరసన కార్యక్రమానికి సంబంధించిన నోటీసును అందజేశారు. ఏప్రిల్ 17న నిర్వహించిన భోజన విరామ నిరసన కార్యక్రమం విజయవంతమైనప్పటికీ, ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అందుకే జిల్లాలోని అన్ని అనుబంధ సంఘాల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. రెండో పీఆర్సీ (PRC) నివేదికను జూన్ 2లోగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 13 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వీటితో పాటు ఈహెచ్ఎస్ (EHS) పథకానికి మార్గదర్శకాలు రూపొందించాలని మరియు సీపీఎస్ (CPS) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (OPS) పునరుద్ధరించాలని ప్రధానంగా కోరుతున్నారు. ఈ నిరాహార దీక్షలో హైదరాబాద్ జిల్లాలోని ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి 64 పెండింగ్ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీ డ్రైవర్ మరణంపట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్, రామచంద్రరావు దిగ్భ్రాంతి

- **శంకర్ గౌడ్ ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే**
- **ఆర్టీసీ కార్మికుల సమస్యలను గాలికొదిలేయడంవల్లే ఈ దుస్థితి**
- **నేడే బీజేపీ పక్షాన అంత్య క్రియలకు హాజరుకానున్న బండి సంజయ్ కుమార్.**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:
పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ మరణించడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ ది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు సమస్యలతో అల్లాడుతుంటే రెండేళ్ల నుండి పట్టించుకోకుండా గాలికొదిలేయడంతోపాటు వారిని బెదిరింపులకు గురిచేయడంవల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులకు అండగా నిలవాలని బీజేపీ నిర్ణయించినట్లు రామచంద్రరావు తెలిపారు. అందులో భాగంగా నేడు నర్సంపేటలో జరిగే శంకర్ గౌడ్ అంత్యక్రియలకు బీజేపీ పక్షాన బండి సంజయ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులెవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దని విజ్ఞప్తి చేశారు.

## కొడంగల్ నుండి గన్ పార్క్ అమర వీరుల స్థూపం వరకు పాదయాత్ర

- **కోట్ల పుష్పలత ముదిరాజ్!**

హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:
కొడంగల్ లో ప్రారంభమైన పాదయాత్ర గన్ పార్క్ అమరవీరుల స్తూపం దగ్గర ముగియడం జరిగింది ఈ సమావేశంలో కోట్ల పుష్పలత ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులు అన్ని విధాలుగా నష్టపోతున్న చిరకాల వాంఛ అయినటువంటి బీసీ ఇంప్లిమెంట్ అయ్యేంతవరకు తను పోరాడుతూనే ఉంటానని తెలియజేశారు రాబోయే మూడు నెలలో బీసీ ఏ ఇంప్లిమెంట్ విషయంలో చొరవ తీసుకొని ముఖ్యమంత్రి పరిష్కరించాలని లేనియెడల మళ్లీ కామారెడ్డి నుండి అమరవీరుల స్తూపం వరకు పాదయాత్ర ప్రారంభం అవుతుంది అని తెలియజేశారు గ్రామాల వైస్ గా మండల్ వైస్ గా డిస్టిక్ వైస్ గా ధర్నాలు ప్రారంభిస్తానని తాను చేయబోయే కార్యచరణ తెలియజేశారు





## రాష్ట్రస్థాయి చదరంగం క్రీడా పోటీలకు ఎంపికైన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు

పెద్దపల్లి వెలుతురు ఏప్రిల్ 23:
పెద్దపల్లి అమర్చంద్ కళ్యాణమండపం లో ఈనెల 22న నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 7 మరియు అండర్ 11 చదరంగం పోటీలలో కరీంనగర్ చెందిన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు అండర్ 7 బాలికల విభాగంలో ఎం సాన్విత, కే అద్వైత, ఎన్ సాన్విత, బాలుర విభాగంలో శ్రీ హన్సిత్, కే శ్రేయాన్స్, ఏ శ్రేయన్స్, అండర్ 11 బాలికల విభాగంలో ఎస్ నేహిత, జి తన్వి, లక్ష్మీ నందిని, అండర్ 11 బాలుర విభాగంలో ఎన్ అశ్విన్, జటిన్ సిద్ధార్థ, సహర్ష్, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను గురువారం జ్యోతి నగర్ లోని జీనియస్ చెస్ అకాడమీ లో వ్యవస్థాపక అధ్యక్షులు కంకటి కనకయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్, జీనియస్ చెస్ అకాడమీ కో డైరెక్టర్ కంకటి సుజన్ కుమార్, కరీంనగర్ డిస్ట్రిక్ట్ డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి తాటిపల్లి సతీష్ బాబు అకాడమీ కోచ్ లు అభిరామ్, రేవిక్, స్వాతి, శ్రీనిజ, చదరంగం క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## నాలుగు జిల్లాల చెత్తతో హుజురాబాద్ భవిష్యత్తును బొంద పెడతారా..?



- **డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యాలపై , పర్యావరణం పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం...**
- **ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి కానీ సమస్యలు సృష్టించకూడదు**
- **బిజెపి శాసనమండలి సభ్యులు అంజి రెడ్డి**



హుజురాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:
హుజురాబాద్ రూరల్ మండలం సిర్సపల్లి శివారులో దాదాపు 125 ఎకరాలలో నాలుగు జిల్లాలకు సంబంధించిన చెత్తను ఇక్కడ డంపింగ్ చేయడానికి యార్డు ఏర్పాటు చేస్తే , చుట్టుపక్క గ్రామాలు, హుజురాబాద్ ప్రజలకు, ఈ ప్రాంత భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని, ప్రభుత్వం నాలుగు జిల్లాల చెత్తతో ఇక్కడ డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి హుజురాబాద్ భవిష్యత్తును బొంద పెడతారా అని బిజెపి శాసనమండలి సభ్యులు అంజిరెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. గురువారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, హుజురాబాద్ బిజెపి నేతలతో కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డంపింగ్ యార్డ్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరికాదని, ప్రజల అభీష్టానికి అనుగుణంగా పనిచేయాల్సిన ప్రభుత్వం తమకు తోచినట్టు వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. నాలుగు జిల్లాల చెత్తను తీసుకొచ్చి ఒక్క ప్రాంతంలో వేస్తే ఇక్కడి ప్రజల పరిస్థితి ఏంటి.? వాళ్లు ఎలా జీవిస్తారు..? వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతుల పరిస్థితి ఏంటి..? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో మొండిగా నిర్ణయం తీసుకొని ఇక్కడి ప్రాంతంలో యార్డ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం భావ్యం కాదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయకపోయినా పర్వాలేదు కానీ, కీడు, హాని తలపెట్టే కార్యక్రమాలు చేపట్టవద్దన్నారు. ప్రశాంతంగా ఉన్న హుజురాబాద్ ప్రాంత ప్రజలను బాధ పెడుతుందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమస్యలను సృష్టించడం సరికాదన్నారు.. డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తామనే ప్రకటన, నిర్ణయంతో హుజురాబాద్ ప్రాంతంలో నెల రోజులుగా గందరగోళ పరిస్థితులు వచ్చాయన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వద్దని నెల రోజులుగా ప్రజలు ఆందోళలు నిరసన కార్యక్రమాలు, రిలే నిరాహార దీక్షలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా మొండి వైఖరి తోనే ఉండడం సరికాదన్నారు.. ప్రజలంతా ఒక్కటై, అన్ని పార్టీలు ,అన్ని సంఘాలు ఒక్కటై జేఏసీగా ఏర్పడి ముక్తకంఠంతో నినదించిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరిని మార్చుకొని ,డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, డంపింగ్ యార్డ్ రద్దు ప్రకటన చేయాలన్నారు. విత్తన కేంద్రంగా ఉన్న ఈ హుజురాబాద్ ఏరియాలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ఏంటి? అని ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, తుర్పాటి రాజు, పారిపెల్లి కొండాల్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఇళ్ళంతకుంట మండల అధ్యక్షులు బైరెడ్డి రమణారెడ్డి, కౌన్సిలర్స్,మొలుగురి సుమలత, పంజాల మనోజ్ దామర అనూష తూర్పాటి లక్ష్మీ దుర్గ కొండ ప్రశాంతి కందుగుల సర్పంచ్ ముప్పు మహేష్,బిజెపి సీనియర్ నాయకులు పైల్ల వెంకట్ రెడ్డి గంగిశెట్టి ప్రభాకర్ ,తూముల శ్రీనివాస్ ,నరాల రాజశకర్ తిప్పబతిని రాజు, యాంశాని శశిధర్, సబ్బని రమేష్, అనురాగ్,మంచికట్ల మురళీ, పదారి సుమన్, గంట సంపత్, కొలిపాక వెంకటేష్, ఇనుగొండ తిరుపతిరెడ్డి, వెంకట్రావు, బైరెడి సంపత్ రెడ్డి, సహదేవ్ క్యాస వెంకటేష్,ఎర్ర శ్రీధర్,నల్ల అజయ్, పద్దం విజయ్, నగేష్,నాయకులు , కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు..

## జహీరాబాద్‌లో మహిళ అదృశ్యం ... భర్త ఫిర్యాదు, కేసు నమోదు



జహీరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23: సం గారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. సత్వార్ గ్రామానికి చెందిన మామిడిగి అనిల్ కుమార్ (32), ప్రస్తుతం వెంకటరమణ కాలనీలో నివసిస్తున్నాడు. ఆయన భార్య దివ్య భారతి (28) గురువారం ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో తన తల్లి ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు.

ఈ విషయమై భర్త అత్తామామల ఇంటికి విచారించగా, అక్కడికి రాలేదని వారు తెలిపారు. దివ్య భారతి ఇంటి నుండి బయలుదేరినప్పుడు జీన్స్, టాప్ ధరించి ఉన్నట్లు సమాచారం. ఆమె ఎత్తు సుమారు 5 అడుగులు 2 అంగుళాలు, చామనచాయ వర్ణం, గుండ్రని ముఖం కలిగి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

భార్య కనిపించకపోవడంతో మామిడిగి అనిల్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ కె వినయ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసు అధికారులు ఆమె ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.



# లగేరహో..సర్క్యూట్!

కాలేజీ కుర్రాళ్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెలెబ్రిటీలు.. ఇప్పుడు ఎవరి నోట విన్నా 'సర్క్యూట్ ట్రైనింగ్'.ఎక్కడ చూసినా ఆ వ్యాయామం వీడియోలే. అందరినీ తన వెనకాల పరుగెత్తిస్తోన్న సర్క్యూట్ ట్రైనింగ్ కసరత్తులతో చాలా ఉపయోగాలే ఉన్నాయి అంటున్నారు ఫిట్‌నెస్ గురూలు.

ఇది ఆల్ ఇన్ వన్ వ్యాయామం. నెల నుంచి మూడునెలలపాటు క్రమం తప్పకుండా చేయాలి. రోజూ ఆరు నుంచి పదిరకాల వర్కవుట్లను వరుసగా ఒకేసారి చేయడమే సర్క్యూట్ ఎక్సర్‌సైజ్. ఫుల్‌బాడీ వర్కవుట్‌లాగా పని చేస్తుంది. స్క్వాట్స్, పులప్స్, పుషప్స్, ప్లాంక్ హోల్డ్, ల్యాంజెస్.. లాంటివి మార్చి మార్చి చేస్తుండాలి. పది నుంచి పదిహేను రెప్స్ చొప్పున ముప్పావుగంట వ్యాయామం చేయాలి.

వరుసగా ఒకటి తర్వాత మరోటిగా వ్యాయామాలు చేస్తూనే ఉండాలి. ఒక వ్యాయామం నుంచి మరో వ్యాయామం మధ్యలో విరామం స్వల్పంగా ఉంటుంది. సర్క్యూట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో కసరత్తుల మధ్య విరామం 30 నుంచి 60 సెకన్లు ఉంటుంది. రెండు మూడు వారాల్లో విరామాన్ని 60/90 సెకన్లకు పెంచుకోవచ్చు. స్ట్రెంగ్త్, కార్డియో వర్కవుట్లు కలిపి చేయాలి. ఇందులో హై ఇంటెన్సిటీ, కార్డియో వ్యాయామాలే ఉంటాయి. కేలరీలు అత్యధికంగా కరుగుతాయి. బరువు తగ్గడానికి, కొవ్వు కరగడానికి బీఎంఐని అదుపులో ఉంచడానికి ఈ కసరత్తులు ప్రభావవంతంగా పని చేస్తాయి.

ఒక్కో సెషన్‌లో శరీరంలోని అన్ని కండర సమూహాలకు వ్యాయామం అందుతుంది. మెటబాలిజమ్‌ని పెంచి యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. గుండె ఆరోగ్యాన్ని పెంచుతాయి.

ఈ రకం వ్యాయామాలకు భారీ సరంజామా అక్కర్లేదు.

జిమ్‌లోనే కాదు.. ఇంట్లో, ఇంటి ఆవరణలో కూడా తేలికగా చేసుకునేలా చిన్నచిన్న పరికరాలు బిగించుకుంటే చాలు. రెసిస్టెన్స్ బ్యాండ్స్, డంబెల్స్, జంప్ రోప్, స్టెబిలిటీ బాల్, పులప్ బార్స్.. ఇలాంటి తేలికైనవి, అతి తక్కువ ఖరీదైనవి సరిపోతాయి. అయితే ఈ సర్క్యూట్ ట్రైనింగ్ కొత్తవాళ్లకి వద్దనే చెబుతారు నిపుణులు.



# ఫస్ట్ డేట్.. ఆచితూచి

ఫస్ట్ డేట్ అంటే జనరేషన్ జడ్ ఎవరికైనా ఒళ్లు జల్లుమంటుంది. మనసు తుళ్లిపడుతుంది. ఉడుకు రక్తానికి ఉద్వేగం డోసు ఎక్కువ కదా! అంతమాత్రాన వాళ్లేం గుడ్డిగా డేట్‌కి ఓకే చెప్పడం లేదు. ఆచితూచి అడుగులేస్తున్నారు. మొదటి మీట్ ఉత్సుకతకన్నా భద్రతకే తొలి ప్రాధాన్యం అంటున్నారు. రెండు తనువుల కెమిస్ట్రీ కన్నా.. మనసుల్లో క్లారిటీ ఉండాలంటున్నారు. ఒక ప్రముఖ డేటింగ్ యాప్ అధ్యయనంలో ఇంకా వాళ్లేం చెప్పారంటే..

**భద్రతే ముఖ్యం:**

తొలి పరిచయం, తొలి పరిణయం ఎప్పటికీ ప్రత్యేకమే. కానీ దానికి ముందు జనరేషన్ జడ్ కొంచెం నెర్వస్‌గా ఫీల్ అవుతోంది. డేట్‌కి వెళ్లిన వ్యక్తితో.. వ్యక్తిగత సమాచారం ఎంతవరకు పంచుకోవాలో తెలియక సగం మంది సతమతం అవుతున్నారు. సేఫ్టీ కోసం అమ్మాయి, అబ్బాయి ఒకర్నొకరు నేరుగా కలవడానికి ముందే 36శాతం మంది ఫొటోలు పంపుకోవడం, వీడియో కాల్ మాట్లాడుకోవడం చేస్తున్నారు. వెళ్లినచోట ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ జాగ్రత్త అన్నమాట.

**స్పష్టత:**

పార్క్, రెస్టరంట్, మాల్.. ఇలా ఫస్ట్ డేట్ ఎక్కడ అనే విషయంలో వాళ్లు ఎంత క్లారిటీగా ఉన్నారో.. ఆ డేట్ ఎక్కడిదాకా తీసుకెళ్లాలో అనే విషయంలో కూడా స్పష్టతతోనే ఉంటున్నారు. పరిచయం, పార్టీలో కలుసుకోవడం.. నచ్చిన తర్వాతే ముద్దూముచ్చటలూ..? [note: printed text] ముద్దూమురిపెం, రిలేషన్‌షిప్‌నకు వెళ్తామని 60శాతం మంది స్పష్టంగా చెప్పారు.

**హద్దుల్లేవు:**

గతంలో ఫస్ట్ డేట్ అంటే దగ్గర ప్రాంతాల్లో ఉన్నవాళ్లతోనే కొనసాగేది. ఇప్పుడు హద్దులు చెరిపేస్తోంది జనరేషన్ జడ్. తొలి పరిచయం కోసం అవసరం అయితే వేరే రాష్ట్రాలు, నగరాలకు వెళ్లడానికీ సిద్ధమని 73శాతం మంది చెబుతున్నారు. వాళ్లు నచ్చితే లాంగ్ డిస్టెన్స్ రిలేషన్‌షిప్‌నకూ సిద్ధమంటున్నారు.

**సామాజికంగా:**

ఫస్ట్ డేట్ అంటే ఇంతకుముందు రహస్యంగా జరిగేది. ఇప్పుడలా కాదు.. దీన్ని కూడా బృంద కార్యక్రమంగా మార్చేస్తోంది యూత్. అధ్యయనం ప్రకారం తమ స్నేహితులు సూచించిన వాళ్లతో డేటింగ్‌కి వెళ్లడానికి కూడా సిద్ధమవుతున్నారు.

# మహిళా బిల్లు ద్రోహి రేవంత్ రెడ్డి

- మహిళలూ...మీ ఇంటికొచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయండి మోదీ పంజా విసరడం తథ్యం
- వచ్చే ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం ఖాయం
- మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలన్నీ కుటుంబ పార్టీలే
- సీఎం రేవంత్ రెడ్డిసహా కాంగ్రెస్ కూటమి నేతలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజం

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 23:**










మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడంతోపాటు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముమ్మాటికీ మహిళా ద్రోహి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందుతుందని భావించి సంబురాలకు సిద్ధమైన దేశ మహిళల ఆశలపై నీళ్లు చల్లారని అన్నారు. పులి పంజా విసిరేటప్పుడు ఒక అడుగు వెనకకు వేస్తోందని, అంత మాత్రాన ఓడినట్లు కాదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం మహిళా బిల్లు విషయంలో ఒక అడుగు వేశారని, రెట్టించిన ఉత్సాహంతో మరో 10 అడుగులు ముందుకేసీ రాబోయే ఎన్నికల్లోపే మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. గురువారం రోజున హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగిన ''మహిళా ఆక్రోశ్ పాదయాత్ర''లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ కూటమి నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏమన్నారంటే...

రాష్ట్రంలో రేవంత్ రెడ్డిని తిట్టని మహిళ లేదు. మహిళా బిల్లును అడ్డుకుని ఏదో సంబురపడుతున్నారు. రేవంత్ రెడ్డిని శాపనార్థాలు పెడుతున్నారు. ప్రకృతిలో తల్లిని కొలిచి పూజించే సనాతన ధర్మం మనది. గోమాత, భూమాత సహా దేవుళ్లను సైతం సతీసమేతంగానే పిలుస్తాం. మోదీ ప్రభుత్వం సైతం మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఈ సంక్షేమ పథకాలే కాకుండా రాజకీయ ప్రాధాన్యమిచ్చి చట్టసభల్లో అడుగు పెట్టేలా చేయాలనే ఉద్దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టింది. దీనిని అడ్డుకుని విపక్షాలు విర్రవీగుతున్నాయి. పులి పంజా విసిరేటప్పుడు ఒక్క అడుగు వెనుకకు వేస్తోంది. ఆ తరువాత 10 అడుగులు ముందుకేసీ పంజా విసురుతుంది. రాబోయే ఎన్నికల్లోపే మహిళా బిల్లును అమలు చేసి తీరుతాం. మోదీ ప్రభుత్వం క్రుత నిశ్చయంతో ఉంది.

మహిళా బిల్లును అడ్డుకునే పార్టీలన్నీ కుటుంబ వారసత్వ పార్టీలే. సోనియాగాంధీ, ఇందిరా గాంధీ, కనిమొళి, డింపుల్ యాదవ్, సుప్రియా సూలే పార్లమెంట్ లో ఉంటే చాలు, సాధారణ మహిళలకు చట్టసభల్లో అడుగుపెట్టే అర్హత లేదని కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, ఎన్సీపీ పార్టీలు చెబుతున్నాయి. అందుకే మహిళా బిల్లును అడ్డుకున్నాయి. పార్లమెంట్ లో బిల్లు ఆమోదం పొందుతుందని సంబురాలకు సిద్ధమైన మహిళల ఆశలపై నీళ్లు చరిత్ర రేవంత్ రెడ్డి.

తెలంగాణలోనూ మహిళలకు నెలకు రూ. 2500లు, తులం బంగారం, స్కూటీ ఇవ్వకుండా మోసం చేయడమే కాకుండా మహిళా బిల్లును అడ్డుకున్న రేవంత్ రెడ్డిని గద్దె దించండి. అందులో భాగంగా మీ ఇంటికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయండి. మహిళా ఆక్రోశం ఏమిటో తెలిసేలా రేవంత్ రెడ్డికి చురకలు అంటించాల్సిన అవసరం ఉంది. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మహిళా బిల్లుకు మద్దతు తెలిపాలని సూచిస్తున్నా. నరేంద్రమోదీ ప్రభుత్వం ముమ్మాటికీ మహిళా పక్షపాతి. రాష్టపతిగా, ఆర్థిక మంత్రి బాధ్యతలను మహిళలకు అప్పగించడమే నిదర్శనం.

# ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో వికారాబాద్ బస్ డిపోను సందర్శించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

- విధులకు హాజరయ్యే సిబ్బందికి పోలీసు రక్షణ.
- చట్టాన్ని అతిక్రమించి విధులకు అడ్డుకుంటే కఠినమైన చర్యలు.

**వికారాబాద్, వెలుతురు ఏప్రిల్ 23:** టీజీఎస్ఆర్టీసీ (TGSRTC) జేఏసీ సమ్మె పిలుపునిచ్చిన నేపథ్యంలో, వికారాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి, బస్సుల రాకపోకలు డిపో వద్ద నెలకొన్న తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవర్లు,ఇతర సిబ్బంది ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,




వారికి పోలీసు శాఖ తరపున పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, లేదా ప్రభుత్వ ఆస్తులైన బస్సులకు నష్టం కలిగించినా సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలకు దిగేవారిపై, విధులను అడ్డుకొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించారు.జిల్లా లోని మూడు డిపోలలో పరిస్థితి శాంతియుతంగా కొనసాగుతోందని ,విల్లింగ్ ఉన్న డ్రైవర్లు విధులకు హాజరుకావాలని, పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తుందని అని తెలిపినారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యాలు కొనసాగేలా చూడటమే తమ ప్రాధాన్యతని ఆమె పేర్కొన్నారు.

# మన భద్రత మన చేతుల్లోనే - విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్, టీజీసీఎస్‌బీ & ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖా గోయల్

- అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట: సైబరాబాద్ సీపీ

**సైబరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23::** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను అరికట్టి, ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యంగా 'Arrive Alive' రోడ్డు భద్రతా కార్యక్రమం ఉధృతంగా కొనసాగుతోంది.

ఇందులో భాగంగా సత్వ నాలెడ్జ్ పార్క్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో డిజిపి (V&E, TGCSB & FSL) శ్రీమతి శిఖా గోయల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీమతి శిఖా గోయల్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల నిబంధనలకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి వ్యక్తిగత బాధ్యత అని స్పష్టం చేశారు. జరిమానాల నుంచి తప్పించుకోవడానికి కాకుండా, తమ ప్రాణాల రక్షణ కోసం వాహనదారులు స్వచ్ఛందంగా నిబంధనలు పాటించాలని ఆమె పిలుపునిచ్చారు.

సమాజంలో జరుగుతున్న ఇతర నేరాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని శిఖా గోయల్ ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,000 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, ఇది చాలా పెద్ద సంఖ్య అని ఆమె పేర్కొన్నారు. వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వాడటం వంటి చిన్న అజాగ్రత్తలు కూడా ప్రాణాంతకంగా మారుతున్నాయని హెచ్చరించారు. ప్రస్తుతం సీట్ బెల్ట్ ధరించడంపై ప్రజల్లో సానుకూల మార్పు కనిపిస్తోందని, అదే విధంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మరియు రహదారి దాటే సమయంలో పాదచారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ, అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలలు మరియు బహిరంగ ప్రదేశాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అతివేగం, మద్యం సేవించి



వాహనం నడపడం, రాష్‌డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ మరియు రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటివి ప్రధాన ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన వివరించారు. "వేగం ఉత్సాహాన్ని ఇస్తుంది.. కానీ ప్రాణాలను తీస్తుంది" (Speed thrills, but it kills) అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. డ్రైవింగ్‌లో క్రమశిక్షణ పాటించడం ద్వారా ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఈ సందర్భంగా కమిషనర్ పునరుద్ఘాటించారు. ముఖ్యంగా 18 నుండి 35 ఏళ్ల లోపు యువతే ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతుండటం పట్ల సీపీ ఆవేదన వ్యక్తం చేశారు. యువత దేశానికి వెన్నెముక అని, వారు తమ బాధ్యతను గుర్తించి 'డిఫెన్సివ్ డ్రైవింగ్' పద్ధతులను అలవాటు చేసుకోవాలని సూచించారు. రోడ్లపై వెళ్లేటప్పుడు కేవలం మన ప్రయాణం గురించే కాకుండా, ఇతర వాహనదారుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

కాలేజీ విద్యార్థుల్లో మార్పు తీసుకురావడానికి ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, యువత తమ ప్రాణాలను పణంగా పెట్టి మితిమీరిన వేగంతో వాహనాలు నడపకూడదని ఆయన హితవు పలికారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల్లో భాగంగా సైబరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ రోప్' (Operation ROPE) ను కఠినంగా అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించడం ద్వారా పాదచారులకు సురక్షితమైన మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తగ్గుతాయని వివరించారు.

# బిజెపి వీధి నాటకాలు ఆపాలి



- రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రదాన కార్యదర్శి పి.ప్రసన్నకుమార్ శర్మ.

**హైదరాబాద్, వెలుతురు ఏప్రిల్ 23:**

బీజేపి దొంగ పాదయాత్రలు వెంటనే ఆపాలి! ప్రజలను మభ్యపెట్టే నాటకాలకు ఇక ఫుల్‌స్టాప్ పెట్టాలి! అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రదాన కార్యదర్శి పి.ప్రసన్నకుమార్ శర్మ అన్నారు.

మహిళల సాధికారత కోసం నిజంగా పనిచేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. రాజీవ్ గాంధీ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మహిళలకు రిజర్వేషన్లు తీసుకొచ్చి, రాజకీయాల్లో మహిళలకు తలుపులు తెరిచారు. అదే మార్గంలో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుకు తీసుకువచ్చి రాజ్యసభలో ఆమోదింపజేశారు. కానీ ఈరోజు కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏమి చేస్తోంది? మహిళల పేరుతో రాజకీయ డ్రామాలు ఆడుతోంది! బిల్లు పాస్ చేశామని గొప్పలు చెప్పుకుంటూ, అమలు మాత్రం ఎప్పుడో 2025 సంవత్సరాల తర్వాత అంటోంది. ఇది మహిళలతో చేసే మోసం కాదు మరేమిటి? డీలిమిటేషన్ పేరుతో బిల్లును తాళ్లేసి పెట్టి, మహిళల హక్కులను బలి చేసేందుకు ప్రయత్నించడం దారుణం. ఓబీసీ , బిసి , SC, ST మహిళల హక్కులపై ఒక్క స్పష్టత లేకుండా బిల్లును తీసుకురావడం, కేవలం ఎన్నికల లాభం కోసం చేసిన కుట్ర మాత్రమే!

ఐదు రాష్ట్రాల ఎన్నికలు కనిపించగానే మహిళలు గుర్తొచ్చారా? ఇంతకాలం ఎక్కడికి వెళ్లింది మీ చిత్తశుద్ధి? ఇది మహిళల గౌరవానికి అవమానం!

దేశంలో మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నాయి... మణిపూర్ మండిపోతోంది... కానీ ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు ఒక్కసారి వెళ్లి బాధితులను పరామర్శించారా? ఒక్క బీజేపీ నాయకుడు గళమెత్తాడా? ఇది మీ మహిళా భద్రతపై ఉన్న నిజమైన వైఖరి!

**మాటల్లో మోసం, పనుల్లో శూన్యం — ఇదే బీజేపీ పాలన!**

మేము స్పష్టంగా చెబుతున్నాం — ధైర్యం ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లును ఒక్కటిగానే తీసుకురండి! వెంటనే అమలు చేయండి! 33% రిజర్వేషన్ ఇప్పుడే ఇవ్వండి!

లేకపోతే మీ దొంగయాత్రలు, మీ నాటకాలు ప్రజలు గమనిస్తున్నారు... సమయం వచ్చినప్పుడు గట్టిగా సమాధానం చెబుతారు!

మహిళలతో ఆటలు ఆడొద్దు... వారి హక్కులను గౌరవించండి... లేకపోతే ప్రజాస్వామ్యం మీకు గుణపాఠం చెబుతుంది అని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ శర్మ అన్నారు

# ఎల్బీనగర్, హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్ వేగవంతం

- ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా భారీ ప్రాజెక్ట్
- 7.1 కి.మీ మేర నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం
- సుమారు రూ.941 కోట్ల అంచనా వ్యయం
- రాష్ట్ర వాటాగా రూ.200 కోట్లు ఇవ్వడానికి సిద్ధమైన ప్రభుత్వం
- 20 లక్షల మందికి ఉపశమనం లభించే అవకాశాలు
- ఎన్ హెచ్-65 పై ప్రమాదాలను తగ్గించే లక్ష్యం
- ఒకే ఏజెన్సీకి పనులు అప్పగించే ప్రతిపాదన
- హెచ్ ఎంఆర్ఎల్ నుంచి కన్సెంట్‌కు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ వెలుతురు ఏప్రిల్ 23:** రాష్ట్ర రాజధానిలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు, ప్రమాదాలను పూర్తిగా నియంత్రించాలనే లక్ష్యంతో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రభుత్వం వేగం పెంచింది. ఈ ప్రాజెక్ట్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు



సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

సుమారు నాలుగు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, కేంద్ర రోడ్డు రవాణా శాఖ (ఎంవోఆర్ టీహెచ్) రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, ఆర్ & బి చీఫ్ ఇంజనీర్ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు సుమారు 7.1 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ డబుల్ డెక్కర్ కారిడార్ నగర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం సుమారు రూ.941 కోట్లుగా నిర్ణయించగా, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లను భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. నాగపూర్ తర్వాత దేశంలో చేపట్టే రెండో పెద్ద డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఇదేనని మంత్రి పేర్కొన్నారు.

ప్రస్తుతం ఎన్ హెచ్ 65 రహదారిపై ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు భారీ ట్రాఫిక్ రద్దీ నెలకొంటోందని, రహదారి దాటే సమయంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఆ సమస్యలు పూర్తిగా తగ్గుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కారిడార్ నిర్మాణంతో ఎల్బీనగర్, హయత్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20 లక్షల మందికి ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. అంతేకాకుండా హైదరాబాద్-విజయవాడ రహదారిపై ప్రయాణించే వాహనదారులు కేవలం 15 నిమిషాల్లో నగరాన్ని దాటే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రాజెక్ట్‌లో కింద సర్వీస్ రోడ్, మధ్యలో జాతీయ రహదారి, పైభాగంలో మెట్రో రైలు మార్గం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో పిల్లర్ ఫౌండేషన్, స్ట్రక్చర్ డిజైన్, మెట్రో స్టేషన్ల నిర్మాణం వంటి అంశాలపై అధికారులు సవివరంగా చర్చించారు. సాధారణ ఎలివేటెడ్ కారిడార్ కంటే మరింత బలంగా, వెడల్పుగా పిల్లర్లు నిర్మించాల్సిన అవసరాన్ని మంత్రి గుర్తుచేశారు.ప్రాజెక్ట్ వేగవంతంగా పూర్తి చేయాలంటే ఒకే వర్క్ ఏజెన్సీకి పనులు అప్పగించడం ఉత్తమమని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీని ద్వారా సమన్వయ లోపాలు తగ్గి, పనులు సమాంతరంగా సాగుతాయని అధికారులు సూచించారు. పనుల మానిటరింగ్ కూడా సులభతరం అవుతుందని పేర్కొన్నారు.

మంత్రి సూచనల మేరకు హెచ్ఎంఆర్ ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్‌కు అవసరమైన కన్సెంట్ ఇవ్వడానికి అంగీకరించారు. తదుపరి దశలో కన్సల్టెన్సీని నియమించి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్ సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా, MoRTH రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్‌ను ఇప్పటికే తమ వార్షిక ప్రణాళికలో చేర్చినట్లు వెల్లడించారు. అవసరమైన సాంక్షన్లు త్వరగా పొందేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు తమ స్థాయిలో పనులు వేగవంతం చేస్తే, వచ్చే వారం కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రాజెక్ట్‌కు తక్షణ ఆమోదం పొందేందుకు ప్రయత్నిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. మొత్తం మీద ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం నగర ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని అందించడమే కాకుండా, ప్రమాదాల రహిత రహదారిగా ఈ మార్గాన్ని మార్చే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.